



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక
ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 361 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ సోమవారం 31 ఆగస్టు 2026 వెల : 1/-రూ ॥
VOLUME :9 ISSUE :361 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA MON 31 AUGUST 2026 PRICE : 1/- RS
Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur

# నేడు వెలిగొండకు కృష్ణమ్మ పరుగులు..

## దశాబ్దాల కలను నెరవేరుస్తున్న సీఎం చంద్రబాబు

- నేడు వెలిగొండ ఫేజ్-1 ప్రారంభించనున్న సీఎం చంద్రబాబు
- నల్లమల సాగర్‌లోకి 10.7 టీఎంసీల కృష్ణా జలాల విడుదల
- మూడు దశాబ్దాల కరువు ప్రాంత రైతుల కల సాకారం
- సాగు, తాగునీటితో పాటు ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం
- నిర్వాసితులకు వేగంగా పరిహారం అందించిన కూటమి ప్రభుత్వం



పెన్ పవర్ డెస్క్:మార్కాపురం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరపడనుంది. కరువు నేల చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం లిఖిస్తూ, వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేడు జాతికి అంకితం చేయనున్నారు. తన చేతుల మీదుగా శంకుస్థాపన చేసుకున్న ఈ ప్రాజెక్టును, తానే ప్రారంభించే అరుదైన అవకాశం చంద్రబాబుకు దక్కింది. లక్షలాది మంది రైతుల సమక్షంలో జరగనున్న ఈ కార్యక్రమంతో పశ్చిమ ప్రకాశం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. శ్రీశైలం ప్రాజెక్టు వెనుక జలాల నుంచి కృష్ణా జలాలను తరలించే ఈ బృహత్తర ఘట్టానికి సర్వం సిద్ధమైంది. ఫీడర్ కెనాల్ గేట్లను ఎత్తి, 10.7 టీఎంసీల కృష్ణా జలాలను నల్లమల

- మిగతా 2లో



# విశాఖలో అంతర్జాతీయ స్థాయి ఆసుపత్రి..

## నేడు ఏఐజీకి శంకుస్థాపన చేయనున్న లోకేశ్

- విశాఖలో కొలువుదీరనున్న ఏఐజీ ఆసుపత్రి
- సోమవారం శంకుస్థాపన చేయనున్న మంత్రి నారా లోకేశ్
- రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 9,000 మందికి ఉపాధి
- వెయ్యి పడకలతో ప్రపంచ స్థాయి వైద్య సేవలు

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్య రంగం మరో కీలక మైలురాయిని అందుకోబోతోంది. ఆసియాలోనే ప్రసిద్ధి చెందిన ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రోఎంటరాలజీ ఆసుపత్రి ఇప్పుడు విశాఖపట్నంలో తన శాఖను ఏర్పాటు చేయనుంది. ప్రజాప్రభుత్వ పాలనలో

- మిగతా 2లో



# విజయసాయిరెడ్డిని కేఏ పాల్ తో పోల్చిన బొత్స

- వైసీపీలో సజ్జల నెంబర్ 1, జగన్ నెంబర్ 2 అంటూ విజయసాయి వ్యాఖ్యలు
- ఈ కామెంట్లపై తీవ్రంగా స్పందించిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ
- విజయసాయి రెడ్డిని కేఏ పాల్‌తో పోల్చుతూ ఘాటు విమర్శ
- ఆయన వ్యాఖ్యలతో సమయం వృథా చేసుకోవద్దని పార్టీ శ్రేణులకు సూచన
- విజయసాయి వ్యాఖ్యలతో వైసీపీలో బయటపడిన అంతర్గత విభేదాలు

పెన్ పవర్ డెస్క్:మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి చేసిన వ్యాఖ్యలు వైసీపీ నాయకత్వాన్ని తీవ్ర ఆగ్రహానికి గురిచేశాయి. వైసీపీలో సజ్జల రామకృష్ణారెడ్డి నెంబర్ 1 అని, జగన్ నెంబర్ 2 అని ఆయన వ్యాఖ్యలు చేయడం తెలిసిందే. ఈ క్రమంలో, పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ.. విజయసాయి రెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.
"విజయసాయి రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను పెద్దగా పట్టించుకోవాల్సిన అవసరం లేదని నేను స్పష్టంగా చెబుతున్నాను.

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

## మందగించిన కొనుగోళ్లు

హైదరాబాద్ నగరంలో ఇళ్ల అమ్మకాలు తగ్గాయి. గతంతో పోలిస్తే ఇప్పుడు ఇళ్ల అమ్మకాలు జరగడం లేదు. పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావంతో ఆర్థిక మాంద్యం ముంచుకొస్తుందని భావించి చాలా మంది ఇళ్ల కొనుగోలుకు ఆసక్తి చూపడం లేదు. మరొకవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాలతో అమెరికాలో ఉద్యోగాలకు భద్రత లేకుండా పోయింది. సాఫ్ట్ వేర్ రంగం కూడా ఇబ్బంది పడుతుంది. ఎప్పుడు ఉద్యోగం ఊడుతుందో తెలియని పరిస్థితుల్లో అనవసర ఆర్థిక భారాన్ని తలకెత్తుకోవడం అనవసరమని భావించి టెకీలు కూడా ఇళ్ల కొనుగోళ్లకు దూరంగా ఉంటున్నారు. మరొకవైపు ద్రవ్యోల్బణం కూడా ఇళ్ల అమ్మకాలు పడిపోవడానికి ప్రధాన కారణంగా ఉందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెబుతున్నారు.

**ప్లాట్లు అమ్ముడుపోకుండా...**

దీంతో హైదరాబాద్ లో లక్షల సంఖ్యలో ప్లాట్లు అమ్ముడు పోకుండా నిలిచిపోయాయి. ఆఫర్లు బిల్డర్లు భారీగా చేస్తున్న ప్రకటనలు కూడా కొనుగోళ్లను పెంచడం లేదు. ఇళ్ల అమ్మకాలు తగ్గడానికి ప్రధాన కారణాలు పెరిగిన ధరలు, మధ్యతరగతికి అందని బడ్జెట్ మరియు కొనుగోలుదారుల సెంటిమెంట్ మందగించడం వంటివి కారణాలుగా చెబుతున్నారు. మరొకవైపు భవనాల నిర్మాణ వ్యయం, ముడి పదార్థాల రేట్లు మరియు వడ్డీ రేట్లు పెరగడం కూడా అమ్మకాలు ఊపు తగ్గడానికి మరొక కారణమని అంటున్నారుసామాన్య, మధ్యతరగతి ప్రజలకు తగినట్లుగా తక్కువ ధరల్లో ఇళ్లు లభించకపోవడం కూడా మరో ప్రధాన కారణంగా చెబుతున్నారు. లగ్జరీ ప్రాజెక్టులపై బిల్డర్లు దృష్టి పెట్టడం, సాధారణ ప్రజల కొనుగోలు శక్తి తగ్గడం వంటివి కొనుగోళ్లపై ప్రభావం చూపాయి.

**ఒడిదుడుకులకు లోనయి...**

హైదరాబాద్లో రియల్ ఎస్టేట్ రంగం కొంత ఒడిదుడుకులకు లోనవుతుంది. దీంతో పాటు ప్రభుత్వ నిబంధనలు, కఠినమైన ఆక్రమణల తొలగింపు చర్యలు మరియు సెక్షన్ 22-ఏ ఆంక్షలు ప్రధాన కారణాలుగా బిల్డర్లు చెబుతున్నారు. హైడ్రా ప్రభావం కూడా కొంత మేర పనిచేస్తుంది. నగరంలో చెరువులు, కుంటలు, ఎఫ్‌టీఎల్ , బఫర్ జోన్లలో ఉన్న అక్రమ కట్టడాలపై కఠిన చర్యలు తీసుకోవడం వల్ల కొనుగోలుదారుల్లో కొంత ఆందోళన నెలకొని అమ్మకాలు మందగించాయి. రెవెన్యూ శాఖ నిషేధిత జాబితాలో పురాతన ప్లాట్లు, హెచ్ఎండీఏ మరియు హౌసింగ్ బోర్డు పరిధిలోని స్థలాలు చేరడంతో రిజిస్ట్రేషన్లు నిలిచి పోయాయి. రిజిస్ట్రేషన్లు కాకపోవడంతో బ్యాంకులు మంజూరు చేసిన రుణాలను రద్దు చేయడం, కొనుగోలుదారులు ముందుకు రాకపోవడం వంటివి కూడా జరుగుతున్నాయి. అయితే మళ్లీ రియల్ ఎస్టేట్ రంగం పుంజుకునే అవకాశాలున్నాయన్న అంచనాలు వినపడుతున్నాయి. మరో వైపు హైదరాబాద్ నగరంలో భూములు మాత్రం అధిక ధరలకు అమ్ముడుపోతున్నాయి. రాయదుర్గం లో ఎకరా 260 కోట్లు ధర పలకడం ఇందుకు ఉదాహరణ. అదే సమయంలో ఇళ్ల కొనుగోళ్లు మాత్రం ఆశించిన స్థాయిలోజరగడం లేదు.

# విశాఖలో అంతర్జాతీయ స్థాయి ఆసుపత్రి.. నేడు ఏఐజీకి శంకుస్థాపన చేయనున్న లోకేశ్

- మొదటి పేజి తరువాయి

అంతర్జాతీయ నగరంగా ఎదుగుతున్న విశాఖలో, ఈ ప్రపంచ స్థాయి వైద్య సంస్థ రాక ఆరోగ్య రంగానికి మరింత బలాన్ని చేకూర్చనుంది. నగరంలోని ఎండాడ ప్రాంతంలో నిర్మించనున్న ఈ ఆసుపత్రికి రాష్ట్ర ఐటీ, విద్యాశాఖల మంత్రి నారా లోకేశ్ సోమవారం శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే, రాష్ట్ర ప్రజలు ఇకపై అత్యున్నత వైద్యం కోసం హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లాల్సిన అవసరం గణనీయంగా తగ్గనుంది.

**భారీ పెట్టుబడి, ఉపాధి అవకాశాలు**

విశాఖలో ఏర్పాటు చేస్తున్న ఏఐజీ ఆసుపత్రి ద్వారా సంస్థ రాబోయే ఐదేళ్లలో దశలవారీగా రూ.2,000 కోట్ల భారీ పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 9,000 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. నిర్మాణం పూర్తయ్యే నాటికి ఆసుపత్రి మొత్తం సామర్థ్యం వెయ్యి పడకలకు చేరుకుంటుంది. ఔట్ పేషెంట్ విభాగం (ఓపీడీ) ద్వారా రోజుకు 5,000 మందికి పైగా రోగులకు వైద్య సేవలు అందించేలా దీనిని తీర్చిదిద్దుతున్నారు. ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చిన తర్వాత సుమారు 1000 మంది డాక్టర్లు ఇక్కడ సేవలు అందించనున్నారు.

**ప్రాజెక్టు స్వరూపం, నిర్మాణ ప్రణాళిక**

విశాఖలోని ఎండాడలో మొత్తం 9 ఎకరాల విస్తీర్ణంలో ఈ ఆసుపత్రి క్యాంపస్‌ను, మరో 2.5 ఎకరాల్లో నర్సింగ్ కళాశాలను నిర్మించనున్నారు. వైద్య సేవలు, శిక్షణ, పరిశోధనలతో పాటు రోగులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన అన్ని సదుపాయాలతో కూడిన సమగ్ర హెల్త్‌కేర్ ఎకోసిస్టమ్‌ను ఒకేచోట ఏర్పాటు చేయడం ఈ ప్రాజెక్టు ప్రత్యేకత.మొదటి దశలో టవర్-ఏ, టవర్-బి నిర్మాణాలను 650 పడకల సామర్థ్యంతో చేపట్టి, 2028 అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రెండో దశలో టవర్-సి నిర్మాణాన్ని 350 పడకల సామర్థ్యంతో మరో రెండేళ్లలో పూర్తి చేస్తారు. హైదరాబాద్‌లోని ఏఐజీ తరహాలోనే ఇక్కడ కూడా 8 సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌తో పాటు 50కి పైగా వైద్య ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయనున్నారు. వీటితో పాటు ప్రత్యేక మాతా శిశు విభాగం కూడా ఉంటుంది.

**పరిశోధన, శిక్షణకు పెద్దపీట**

వైద్య సేవలతో పాటు విద్య, పరిశోధనలకు ఏఐజీ పెద్దపీట వేస్తోంది. ఇందులో భాగంగా నర్సింగ్ కళాశాల, సిబ్బందికి హాస్టల్, పారామెడిక్ సిబ్బందికి శిక్షణా కేంద్రం, 500 సీట్ల సామర్థ్యంతో ఆడిటోరియం నిర్మించనున్నారు. క్లినికల్ వ్యవస్థలోనే రీసెర్చ్ ల్యాబ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సెంటర్‌ను ఏర్పాటు చేయనుండటం విశేషం. విజిటింగ్ ఫ్యాకల్టీ, వైద్యుల కోసం వసతితో పాటు రోగుల సహాయకుల కోసం తక్కువ ఖర్చుతో కూడిన వసతి సౌకర్యాలు కూడా కల్పిస్తారు.

వైద్య రంగంలో 30 ఏళ్లకు పైగా అనుభవం ఉన్న ఏఐజీ, ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ట్రోఇంటెస్టైనల్ ఎండోస్కోపీ యూనిట్‌గా గుర్తింపు పొందింది. ఈ ఆసుపత్రి రాకతో విశాఖ హెల్త్‌కేర్ హబ్‌గా మారడమే కాకుండా, ఉత్తరాంధ్రతో పాటు ఒడిశా సరిహద్దు ప్రాంతాల ప్రజలకు కూడా అత్యున్నత వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.

# నేడు వెలిగొండకు కృష్ణమ్మ పరుగులు..

- మొదటి పేజి తరువాయి

సాగర్ రిజర్వాయర్‌లోకి ముఖ్యమంత్రి చంద్రబాబు విడుదల చేయనున్నారు. పోలవరం ప్రాజెక్టు తరహాలోనే వెలిగొండపై ప్రత్యేక దృష్టి సారించిన కూటమి ప్రభుత్వం, గడిచిన రెండేళ్లలోనే ఈ ప్రాజెక్టు కోసం రూ.2,400 కోట్లకు పైగా ఖర్చు చేసింది. దీంతో కలగా మిగిలిపోతుందనుకున్న ప్రాజెక్టు ఇప్పుడు కళ్లముందు సాక్షాత్కరించింది.ఈ ప్రాజెక్టు పూర్తికావడంతో ప్రకాశం, మార్కాపురం జిల్లాల రైతాంగానికి సాగునీటి కష్టాలు తీరనున్నాయి. దీంతో పాటు దశాబ్దాలుగా ఈ ప్రాంత ప్రజలను పట్టిపీడిస్తున్న తీవ్రమైన ఫ్లోరైడ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుంది. ఇంటింటికీ కుళాయి ద్వారా సురక్షిత తాగునీరు అందించే కార్యక్రమానికి కూడా ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. కృష్ణమ్మ రాకతో కరవు నేలలో కొత్త ఆశలు చిగురిస్తున్నాయని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా నిర్వాసితులైన కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచింది. కేవలం మూడు విడతల్లోనే 6,206 కుటుంబాలకు రూ.768 కోట్ల పరిహారాన్ని వేగంగా అందించింది. అదనంగా మరో రూ.169 కోట్లను కూడా ప్రకటించింది. 2019 తర్వాత 18 ఏళ్లు నిండిన యువతకు రూ.2 లక్షల చొప్పున పరిహారం, 4,933 పశువులకు 30 రోజుల పాటు దాణా, 10 వేల కుటుంబాలకు నిత్యావసర సరుకుల కిట్లను పంపిణీ చేస్తున్నారు. నిర్వాసిత మహిళలను గౌరవించేలా చీర, పసుపు, కుంకుమ అందించాలన్న సీఎం ఆదేశాలతో అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ చారిత్రక ఘట్టాన్ని 'వెలిగొండ పండుగ'గా జరుపుకునేందుకు ప్రతి గ్రామం కళకళలాడుతోంది.

## విజయసాయిరెడ్డిని కేఏ పాల్ తో పోల్చిన బొత్స

- మొదటి పేజి తరువాయి

ఆయన మాటలను సీరియస్‌గా తీసుకోవాల్సిన పని లేదు. రాజకీయాల్లో ఇలాంటి వాళ్లు వస్తూ పోతూ ఉంటారు. ఇంతకుముందు మనకు కేఏ పాల్ ఒకరు ఉండేవారు, ఆయన ఏదేదో మాట్లాడుతుండేవారు. ఇప్పుడు విజయసాయిరెడ్డి రెండో వ్యక్తిగా తయారయ్యారు. ఆయన మాటలకు విలువ ఇచ్చి స్పందించడం అంటే మన సమయాన్ని మనం వృథా చేసుకోవడమే.చూడండి, శుభ్రంగా సాయంత్రం వేళ ప్రశాంతంగా కూర్చున్నాం. ఇలాంటి సమయంలో ఆ పనికిమాలిన మాటల గురించి ఎందుకు మాట్లాడాలి? దానివల్ల నా సమయం వృథా అవ్వడమే కాకుండా, అసలు విషయాలైన ప్రజా సమస్యల నుంచి మన దృష్టి మళ్లుతుంది. ప్రజల సమస్యలు ఎన్నో ఉన్నాయి, వాటిపై దృష్టి పెట్టాలి. అంతేకానీ, ఇలాంటి

వాటి కోసం కాదు.ఆయనకేదో అది పెద్ద విషయంలా అనిపిస్తే, దానికోసం ఒక ప్రెస్ మీట్ పెట్టుకోమనండి. బహిరంగంగా చెప్పుకోమనండి. అంతేగానీ, దానికోసం మేం సమయం కేటాయించం. అనవసరంగా ఇలాంటి విషయాల గురించి చర్చించి మన విలువైన సమయాన్ని పాడుచేసుకోవడం ఎందుకు? కాబట్టి, ఆ విషయం గురించి మళ్లీ మళ్లీ అడిగి మీ సమయం, నా సమయం వృథా చేయొద్దని కోరుతున్నాను" అని బొత్స పేర్కొన్నారు.

## వెలిగొండ ప్రాజెక్టు ట్రయల్ విజయవంతం.. హెడ్ రెగ్యులేటర్‌కు చేరుకున్న కృష్ణా జలాలు..




- సంతృప్తికరంగా ముగిసిన వెలిగొండ ప్రాజెక్టు ట్రయల్ రన్
- కొల్లం వాగు వద్ద గేట్లు ఎత్తి సొరంగంలోకి కృష్ణా జలాల విడుదల
- పాజెక్టును జాతికి అంకితం చేయనున్న సీఎం చంద్రబాబు
- ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల కరవు ప్రాంతాలకు తీరనున్న నీటి కష్టాలు

ప్రకాశం జిల్లాతో పాటు పలు జిల్లాల దశాబ్దాల సాగు, తాగునీటి కలను సాకారం చేసే పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టులో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. ప్రాజెక్టు మొదటి దశకు సంబంధించి అధికారులు ఆదివారం నిర్వహించిన ట్రయల్ రన్ విజయవంతమైంది. సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఈ ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. ఈ చారిత్రాత్మక ఘట్టంతో కరవు సీమలో ఆనందం వెల్లివిరుస్తోంది.

ఆదివారం ఉదయం అధికారులు కొల్లం వాగు వద్ద ప్రాజెక్టు గేట్లను ఎత్తి సొరంగ మార్గంలోకి కృష్ణా జలాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా గేట్ల పనితీరు, సొరంగంలో నీటి ప్రవాహ వేగాన్ని, నీటి తరలింపు ప్రక్రియను క్షుణ్ణంగా పర్యవేక్షించారు. సొరంగంలో పరుగులు తీసిన కృష్ణా జలాలు గంటవానిపల్లి క్రాస్ హెడ్ రెగ్యులేటర్‌కు చేరుకున్నాయి. ముందుజాగ్రత్త చర్యగా రెగ్యులేటర్ వద్ద సైరన్ మోగించి సమీప ప్రజలను అప్రమత్తం చేశారు. ట్రయల్ రన్ విజయవంతం కావడంతో అధికారులు, స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

శ్రీశైలం జలాశయం ముందు భాగం నుంచి సుమారు 43.5 టీఎంసీల కృష్ణా వరద జలాలను తరలించి, నల్లమల సాగర్‌లో నిల్వ చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశం. దీని ద్వారా ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరువు పీడిత, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించనున్నారు. ముఖ్యంగా మార్కాపురం వంటి పశ్చిమ ప్రకాశం ప్రాంత ప్రజల నీటి కష్టాలకు ఈ ప్రాజెక్టుతో శాశ్వత పరిష్కారం లభించనుంది. ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు.

## అదే పెద్దపులి మళ్లీ వచ్చింది.. పోలవరం ప్రాజెక్టు వద్ద భయాందోళనలో ప్రజలు



ఏలూరు జిల్లాలోని పోలవరం ప్రాజెక్టు సమీపంలో పెద్దపులి సంచారం తీవ్ర కలకలం రేపుతోంది. ప్రాజెక్టు పరిధిలోని దేవరగొండి జంట టన్నెళ్ల వద్ద పులి తిరుగుతుండటంతో స్థానిక గ్రామ ప్రజలు, ప్రాజెక్టు సిబ్బంది భయాందోళనలకు గురవుతున్నారు. రెండు దూడలను చంపేయడంతో ఈ భయం మరింత పెరిగింది. అటవీ శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగి పులిని బంధించేందుకు చర్యలు చేపట్టారు.వివరాల్లోకి వెళితే, శనివారం రాత్రి పోలవరం ప్రాజెక్టు పాత దేవరగుండి టన్నెల్ వద్ద ఉన్న రెగ్యులేటర్ సమీపంలో స్థానికులు పులిని గమనించారు. అక్కడే ఉన్న రెండు దూడలపై అది దాడి చేసి చంపేసింది. ఈ ఘటనతో సమీప గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనకు లోనయ్యారు. ఆదివారం ఉదయం ముంపు గ్రామమైన దేవరగొండిలోని జంట టన్నెళ్ల వద్ద కూడా పులి కదలికలను అధికారులు గుర్తించారు. దీంతో అప్రమత్తమైన అటవీ శాఖ అధికారులు ప్రాజెక్టు ఇంజనీర్లు, ఏజెన్సీ ప్రతినిధులు, స్థానికులకు హెచ్చరికలు జారీ చేశారు. రాత్రి సమయాల్లో ఒంటరిగా బయటకు రావద్దని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**గతంలో పట్టుబడి, మళ్లీ ప్రత్యక్షం**

ఈ ఏడాది జనవరిలో ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి ఏలూరు జిల్లా కుక్కునూరు మండలంలోకి ప్రవేశించిన ఈ పులి, అప్పట్లో బుట్టాయగూడెం, కొయ్యలగూడెం మండలాల్లోనూ సంచరించి కలకలం రేపింది. ఆ తర్వాత తూర్పుగోదావరి జిల్లా అడవుల్లోకి వెళ్లింది. రాయవరం సమీపంలో దీని సంచారం ఎక్కువ కావడంతో, పుణే నుంచి వచ్చిన ప్రత్యేక బృందం ఫిబ్రవరిలో దీనిని సురక్షితంగా పట్టుకుంది.అనంతరం పులిని విశాఖపట్నం జూకు తరలించి, ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, ఆధునిక కాలర్ ఐడీని అమర్చారు. పోలవరం ప్రాంతంలోని పాపికొండల అభయారణ్యంలో దానిని తిరిగి వదిలిపెట్టారు. అయితే, అది అభయారణ్యానికే పరిమితం కాలేదు. ఏప్రిల్ 14న గోదావరి నదిని దాటి కొట్టూరు ముంపు గ్రామంలోకి ప్రవేశించి, అప్పటి నుంచి ఏలూరు, పోలవరం, తూర్పుగోదావరి జిల్లాల మధ్య సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది.

## ఆంధ్రా అబ్బాయితో అమెరికాలో కుమార్తె పెళ్లి.. ఆన్‌లైన్‌లో అక్షింతలు చల్లారు!



కన్నకూతురి వివాహాన్ని కళ్లారా చూసి, అక్షింతలు వేసి ఆశీర్వదించాలని ప్రతి తల్లిదండ్రులూ కలలు కంటారు. కానీ, కొన్నిసార్లు దూరాలు అడ్డుగోడలుగా నిలుస్తాయి. సరిగ్గా ఇలాంటి ఓ సంఘటనే సూర్యాపేట జిల్లాలో చోటుచేసుకుంది. వీసా సమస్యల కారణంగా అమెరికాలో జరిగిన తమ ఏకైక కుమార్తె వివాహానికి హాజరు కాలేకపోయిన తల్లిదండ్రులు, వీడియో కాల్ ద్వారానే వేడుకను వీక్షించి నూతన వధూవరులను ఆశీర్వదించారు.వివరాల్లోకి వెళితే, సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం వేపలసింగారం గ్రామానికి చెందిన జయరాజు, జ్యోతి దంపతుల ఒక్కగానొక్క కుమార్తె హిమబిందు. ఆమె అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. ఈ క్రమంలో ఆంధ్రప్రదేశ్‌లోని ఎన్టీఆర్ జిల్లాకు చెందిన రోహిత్‌తో ఆమెకు పరిచయం ఏర్పడి, అది ప్రేమగా మారింది. ఇరు కుటుంబాల అంగీకారంతో వీరిద్దరూ అమెరికాలోనే వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు.కూతురి పెళ్లిని దగ్గరుండి జరిపించాలని భావించిన జయరాజు, జ్యోతి దంపతులు అమెరికా వెళ్లేందుకు ప్రయత్నించారు. అయితే, వీసా సంబంధిత సమస్యలు తలెత్తడంతో వారి ప్రయాణం చివరి నిమిషంలో ఆగిపోయింది. దీంతో వారు తీవ్ర నిరాశకు గురయ్యారు. అయినప్పటికీ, టెక్నాలజీ సాయంతో వారు తమ కుమార్తె వివాహ వేడుకలో పాలుపంచుకున్నారు.అమెరికాలో హిమబిందు, రోహిత్‌ల వివాహం జరుగుతుండగా, ఇక్కడ స్వగ్రామంలోని తమ నివాసం నుంచి తల్లిదండ్రులు వీడియో కాల్ ద్వారా వేడుకను ప్రత్యక్షంగా వీక్షించారు. కళ్లారా కూతురి పెళ్లిని చూడలేకపోయామన్న బాధ ఉన్నప్పటికీ, ఆన్‌లైన్‌లోనే నూతన దంపతులను మనసారా ఆశీర్వదించారు. అంతేకాకుండా, బంధుమిత్రులు, గ్రామస్థుల కోసం తమ గ్రామంలో ఘనంగా విందు భోజనాలు ఏర్పాటు చేసి తమ సంతోషాన్ని పంచుకున్నారు. ఈ ఘటన స్థానికంగా అందరి దృష్టిని ఆకర్షించింది.

# సెప్టెంబర్ 1న ఇంటి వద్దే ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 30:** సెప్టెంబర్ నెల ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సెప్టెంబర్ 1న ఉదయం 6.30 గంటల నుంచే లబ్ధిదారుల ఇంటి వద్ద పంపిణీ చేసేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎం.ఎస్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. జిల్లాలో మొత్తం 2,65,439 మంది లబ్ధిదారులకు రూ.115.65 కోట్ల పింఛను సొమ్మును పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

అవ్వాతాతలు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు, ఇతర పింఛనుదారులకు సచివాలయ సిబ్బంది ఇంటి వద్దే పింఛను సొమ్ము అందజేస్తారని కలెక్టర్ తెలిపారు. తొలి రోజే నూరు శాతం పింఛన్ల పంపిణీ పూర్తయ్యేలా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. సెప్టెంబర్ నెలలో జిల్లాలో 272 మందికి కొత్తగా స్పౌజ్ పింఛన్లు మంజూరైనట్లు కలెక్టర్ తెలిపారు. పింఛన్ల పంపిణీ సకాలంలో, పారదర్శకంగా పూర్తయ్యేలా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు.



పెన్ పవర్
కాకినాడ
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా

# వాడపల్లి అభివృద్ధికి కేంద్ర నిధులు తీసుకొస్తాం








- ప్రసాద పథకం ద్వారా ప్రత్యేక నిధుల కోసం కృషి చేస్తా: కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ
- భక్తుల పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా మౌలిక వసతుల కల్పన అన్నదాన భవనం ప్రారంభోత్సవంలో కీలక ప్రకటన
- భక్తుల పెరుగుతున్న రద్దీకి అనుగుణంగా మౌలిక వసతుల కల్పన అన్నదాన భవనం ప్రారంభోత్సవంలో కీలక ప్రకటన

**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 30:** కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసి, దేశవ్యాప్తంగా భక్తులను ఆకర్షించే ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర ప?భుత్వం నుంచి అవసరమైన నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని కేంద్ర మంత్రి, నరసాపురం ఎంపీ శ్రీనివాస వర్మ తెలిపారు. కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న ప్రసాద్ పథకం ద్వారా వాడపల్లి ఆలయానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయించే దిశగా చర్యలు చేపడతానని ఆయన హామీ ఇచ్చారు.

వాడపల్లి క్షేత్రంలో నూతనంగా నిర్మించిన వకుళామాత అన్నదాన భవనం ప్రారంభోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో కేంద్ర మంత్రి మాట్లాడారు. భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఆలయంలో దర్శనం, వసతి, అన్నదానం, పారిశుద్ధ్యం, తాగునీరు, రవాణా తదితర రంగాల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

**దేశవ్యాప్తంగా భక్తులను ఆకర్షిస్తున్న వాడపల్లి**

వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి క్షేత్రం ఇప్పటికే కోనసీమలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా గుర్తింపు పొందిందని శ్రీనివాస వర్మ అన్నారు. శనివారాలు, ప్రత్యేక పర్వదినాలు, బ్రహ్మోత్సవాల సమయంలో పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివస్తున్నారని పేర్కొన్నారు. 2026 జూలైలో ఒక శనివారం భారీగా భక్తులు తరలిరాగా, ఆలయానికి ఒకే రోజు రూ.1.01 కోట్ల ఆదాయం వచ్చినట్లు వార్తా నివేదికలు పేర్కొన్నాయి.

భక్తుల రద్దీ పెరుగుతున్న కొద్దీ ఆలయ పరిసరాల్లో మౌలిక వసతులను కూడా అదే స్థాయిలో పెంచాల్సిన అవసరం ఉందని మంత్రి అన్నారు. భక్తులకు ఆధ్యాత్మిక అనుభూతితో పాటు సౌకర్యవంతమైన దర్శనం, భోజనం, విశ్రాంతి వంటి వసతులు అందుబాటులో ఉండేలా సమగ్ర ప్రణాళిక రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

**ఒకేసారి 2,500 మందికి అన్నదానం**

అన్నదానం అన్ని దానాలకంటే గొప్పదని శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే ఏ భక్తుడూ ఆకలితో తిరిగి వెళ్లకూడదనే సంకల్పంతో నూతన అన్నదాన భవనాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు.

నూతన వకుళామాత అన్నదాన భవనంలో ఒకేసారి సుమారు 2,000 నుంచి 2,500 మంది భక్తులు భోజనం చేసేలా సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. ఆధునిక వంట పరికరాలను ఏర్పాటు చేయడం ద్వారా రోజుకు సుమారు 40 వేల మంది భక్తులకు ప్రసాదం సిద్ధం చేసే సామర్థ్యం కల్పించినట్లు వివరించారు.

భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్ అవసరాలను కూడా పరిగణనలోకి తీసుకుని ఆలయ అభివృద్ధి పనులు చేపట్టాలని ఆయన సూచించారు.

**కేంద్ర ప్రసాద పథకంతో మరింత అభివృద్ధి**

వాడపల్లి స్వామివారు ఒక్క ప్రాంతానికే పరిమితమైన దేవుడు కాదని, దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చే ఆరాధ్య దైవమని కేంద్ర మంత్రి అన్నారు. అందువల్ల వాడపల్లి క్షేత్రాన్ని ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు సమకూర్చే అవకాశం ఉందన్నారు.కేంద్ర పర్యాటక శాఖ పరిధిలోని ప్రసాద్ పథకం ద్వారా వాడపల్లి ఆలయానికి నిధులు తీసుకురావడానికి కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి మాట్లాడతానని శ్రీనివాస వర్మ తెలిపారు. ఆలయ అభివృద్ధికి అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేసి కేంద్రం దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు.

అదేవిధంగా కామన్ గుడ్ ఫండ్ (జ+ఖీ), టీటీడీ తదితర మార్గాల ద్వారా కూడా ఆలయ అభివృద్ధికి నిధులు సమకూర్చే అవకాశాలను పరిశీలిస్తామని చెప్పారు.

**భక్తుల విశ్వాసమే ఆలయానికి బలం**

దేవుడికి మనం దానం చేస్తున్నామనే భావన కంటే, మనకు లభించిన సంపదలో కొంత భాగాన్ని భగవంతుడికి సమర్పించుకునే అవకాశం లభించడం ఆయన అనుగ్రహంగా భావించాలని శ్రీనివాస వర్మ అన్నారు.

ఆలయానికి వచ్చే భక్తుల సంఖ్య పెరగడంతో పాటు వారి విశ్వాసం, సేవాభావం కూడా పెరుగుతోందన్నారు. భక్తుల సహకారంతోనే ఆలయ అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని పేర్కొన్నారు.

**గణనీయంగా పెరిగిన ఆలయ ఆదాయం**

ప్రస్తుత పాలకమండలి ఆధ్వర్యంలో ఆలయ ఆదాయం గణనీయంగా పెరిగిందని కేంద్ర మంత్రి తెలిపారు. గతంలో శనివారం టికెట్ల ద్వారా సుమారు రూ.30 లక్షల ఆదాయం వచ్చేదని, ప్రస్తుతం అదే ఆదాయం సుమారు రూ.కోటికి చేరిందన్నారు.అలాగే గతంలో నెలకు సుమారు రూ.కోటి వరకు ఉన్న హుండీ ఆదాయం ప్రస్తుతం రూ.2 కోట్లకు చేరిందని వివరించారు. ఆలయంపై భక్తులకు పెరిగిన విశ్వాసం, నమ్మకం, సేవా కార్యక్రమాల విస్తరణ తదితర కారణాల వల్లే ఆదాయం పెరుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు.

**పెరుగుతున్న భక్తుల రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు**

వాడపల్లి ఆలయానికి శనివారాల్లో భారీగా భక్తులు తరలివస్తున్న సందర్భాలు గతంలోనూ నమోదయ్యాయి. 2024లో ఒక శనివారం సుమారు 50 వేల మందికి పైగా భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు వార్తా నివేదికలు పేర్కొన్నాయి.

అదేవిధంగా 2026లో కూడా భారీగా భక్తుల రాక నమోదైంది. దీంతో భవిష్యత్‌లో భక్తుల రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆలయ అధికారులు, పాలకమండలి దీర్ఘకాలిక అవసరాలను దృష్టిలో పెట్టుకుని మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

**అన్నదానానికి దాతల సహకారం**

వాడపల్లి ఆలయంలో జరుగుతున్న అన్నదాన కార్యక్రమాలకు భక్తులు, దాతలు కూడా తమవంతు సహకారం అందిస్తున్నారు. ఇటీవల నూజివీడు భక్త సమాజం రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల అన్నదాన కార్యక్రమాల కోసం కూరగాయలను విరాళంగా అందించగా, అందులో 4 టన్నుల కూరగాయలను వాడపల్లి ఆలయానికి పంపినట్లు సమాచారం.

దీంతో ఆలయంలో నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమానికి భక్త సమాజం నుంచి లభిస్తున్న సహకారం కూడా మరింత బలపడుతోంది.

**అభివృద్ధికి సమగ్ర ప్రణాళిక అవసరం**

వాడపల్లి ఆలయానికి పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని కేవలం దర్శనం, అన్నదానం మాత్రమే కాకుండా పార్కింగ్, తాగునీరు, మరుగుదొడ్లు, విశ్రాంతి ప్రదేశాలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు, రద్దీ నియంత్రణ, పారిశుద్ధ్యం, భద్రత వంటి అంశాలపై సమగ్ర ప్రణాళిక అవసరమని భక్తులు కోరుతున్నారు.

జిల్లా అధికారిక వెబ్‌సైట్ కూడా వాడపల్లి గ్రామం రావులపాలెం నుంచి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు, ఆలయం గోదావరి ప్రాంత ఆధ్యాత్మిక ప్రాధాన్యంతో కూడుకున్నదిగా పేర్కొంటోంది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి, ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ, తణుకు ఎమ్మెల్యే రాధాకృష్ణ, ఆలయ పాలకమండలి చైర్మన్ వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, ఆలయ సిబ్బంది, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.వాడపల్లి ఆలయానికి కేంద్ర నిధులు సమకూరితే భవిష్యత్‌లో మరింత విస్తృత స్థాయిలో మౌలిక వసతులు అభివృద్ధి చెందే అవకాశం ఉందని భక్తులు ఆశాభావం వ్యక్తం చేశారు. కోనసీమ తిరుమలగా గుర్తింపు పొందిన వాడపల్లి క్షేత్రాన్ని జాతీయ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో చర్యలు ముందుకు సాగాలని వారు కోరుతున్నారు.

## గంజాయి, డ్రగ్స్ కు వ్యతిరేకంగా జగ్గంపేటలో ర్యాలీ




**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 30 :** గంజాయి డ్రగ్స్ కు వ్యతిరేకంగా జగ్గంపేటలో ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. జగ్గంపేట ఎస్సై టి. రఘునాథరావు ఆధ్వర్యంలో జగ్గంపేట పోలీస్ సిబ్బంది, జగ్గంపేట యువకులు కలిసి డ్రగ్స్, గంజాయి కి వ్యతిరేకంగా సైకిల్ ర్యాలీ చేపట్టారు. డ్రగ్స్, గంజాయి వల్ల కలిగే అనర్ధాలను ప్రజలకు వివరించారు. మత్తు పదార్థాలకు బానిసలు అయి జీవితాలను నాశనం చేసుకోవద్దు అని సూచించారు. ఎక్కడైనా గంజాయి,డ్రగ్స్ తాగిన, అమ్మినా,సరఫరా చేసినట్లు తెలిసిన తమకు సమాచారం తెలియజేయాలని జగ్గంపేట ఎస్ఐ టి.రఘునాధ రావు తెలిపారు.

## గుర్రంపాలెంలో శ్రీ పట్టాభిరామ స్వామి ఆలయ పునఃనిర్మాణానికి శంకుస్థాపన

**జగ్గంపేట, పెన్ పవర్, ఆగస్టు 30:** సుమారు 100 సంవత్సరాల పైబడి భక్తుల ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్న జగ్గంపేట మండలం గుర్రంపాలెం శ్రీ పట్టాభిరామ స్వామి ఆలయ పునఃనిర్మాణ శంకుస్థాపన మహోత్సవం తిరుమల తిరుపతి దేవస్థానం శ్రీవాణి ట్రస్ట్ నిధులనుండి 20 లక్షల రూపాయలతో ఆదివారం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ హాజరై శంకుస్థాపన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ పట్టాభిరాముడు కేవలం దేవుడు మాత్రమే కాదు, ధర్మానికి, సత్యానికి, త్యాగానికి ప్రతిరూపమని అన్నారు. 100 ఏళ్ల నాటి ఈ పురాతన ఆలయానికి పునర్వైభవం తీసుకురావడం తమ బాధ్యత అని, ఆలయ పునఃనిర్మాణానికి తిరుమల వెంకటేశ్వర స్వామి శ్రీవాణి ట్రస్ట్ నిధులు 20 లక్షల రూపాయలతో ఆలయ పునర్నిర్మాణం చేపట్టడం జరిగిందని అన్నారు. రామాలయం ఉన్న చోట రామరాజ్యం ఉంటుందని, గ్రామంలో సుఖశాంతులు, ఐకమత్యం వెల్లివిరుస్తాయని, భక్తులు, గ్రామస్తులు, దాతలు అందరూ కలిసి ఆలయ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్, ఎస్ వి ఎస్ అప్పలరాజు, కొత్త కొండబాబు,శ్రీ పట్టాభిరామ స్వామి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






## పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు జనసేన శ్రేణుల సన్నాహాలు

- పిఠాపురంలో జనసేన యువజన విభాగం ప్రారంభోత్సవం..
- పాదగయ నుంచి భారీ బైక్ ర్యాలీ

**పెన్ పవర్ ప్రతినిధి (పిఠాపురం) ఆగస్టు 30:** జనసేన పార్టీ అధినేత, పిఠాపురం ఎమ్మెల్యే, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ జన్మదినాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లా పిఠాపురంలో ఘనంగా కార్యక్రమాలు నిర్వహించేందుకు జనసేన నాయకులు సన్నాహాలు చేస్తున్నారు. పవన్ కళ్యాణ్ జన్మదినం రోజున పిఠాపురం పట్టణంలో జనసేన యువజన విభాగం ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్లు కాకినాడ జిల్లా జనసేన అధ్యక్షుడు, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి బాబు తెలిపారు.

ఈ సందర్భంగా కార్యక్రమ ఏర్పాట్లను ఆయన పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం రామస్వామి బాబు మాట్లాడుతూ.. ప్రస్తుతం కేరళలో వైద్య చికిత్స పొందుతున్న పవన్ కళ్యాణ్ యువత, మహిళలకు సందేశాన్ని ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా అందించనున్నట్లు తెలిపారు. యువత, మహిళలకు దిశానిర్దేశం చేయాలనే ఉద్దేశంతోనే జనసేన యువజన విభాగాన్ని ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు.

పవన్ కళ్యాణ్ జన్మదినం సందర్భంగా పాదగయ నుంచి పిఠాపురం పట్టణం వరకు బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా వ్యాప్తంగా జనసేన నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం అనంతరం వివిధ ప్రాంతాల ఇన్‌చార్జులు, ఎమ్మెల్యేలు తమ ప్రాంతాల్లో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారని వివరించారు.

యువత, మహిళలకు సామాజిక, రాజకీయ అంశాలపై అవగాహన కల్పించి, వారిని ప్రజాసేవ వైపు నడిపించడమే యువజన విభాగం కార్యక్రమాల ప్రధాన లక్ష్యమని రామస్వామి బాబు అన్నారు.

ఈ కార్యక్రమంలో పిఠాపురం పట్టణ ఇన్‌చార్జి డా. చిక్కాల వరలక్ష్మి రమణారావు, బుర్ర దివ్యరాజు, గొల్లప్రోలు మండల ఇన్‌చార్జి జ్యోతుల శ్రీనివాస్, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యుడు బొజ్జ కుమార్, మార్కెట్‌యార్డు చైర్మన్ దేవి సూర్యప్రకాష్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ దానం లాజరు బాబు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ పెంక్ జగదీష్, దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ కెపీఎస్ భవాని శంకర్, వార్డు ఇన్‌చార్జులు, కార్యకర్తలు, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# తలుపులమ్మ సన్నిధిలో భక్తుల సందడి






**ఒక్కరోజే 10 వేల మందికి అమ్మవారి దర్శనం.. రూ.5.01 లక్షల ఆదాయం**

**పెన్ పవర్ ప్రతినిధి (లోవ) ఆగస్టు 30:**కాకినాడ జిల్లా తుని మండలం లోవలోని శ్రీ తలుపులమ్మ అమ్మవారి దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సుమారు 10 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.
భక్తుల రాకతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన సౌకర్యాలను కల్పించారు. దర్శనానికి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ అధికారులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.
ఆదివారం వివిధ సేవలు, ప్రసాదాల విక్రయం ద్వారా దేవస్థానానికి మొత్తం రూ.5,01,803 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి విశ్వనాథరాజు తెలిపారు. ఇందులో ప్రసాదాల విక్రయం ద్వారా రూ.1,38,615, పూజా టికెట్ల ద్వారా రూ.2,39,780, కేశఖండన టికెట్ల ద్వారా రూ.12,720, వాహన పూజలు, ఇతర సేవల టికెట్ల ద్వారా రూ.13,340, వసతి గదుల ద్వారా రూ.50,670, ఇతర విరాళాల ద్వారా రూ.37,192, వేద ఆశీర్వచనం ద్వారా రూ.9,486 ఆదాయం వచ్చినట్లు వివరించారు.
భక్తులకు అవసరమైన అన్ని సదుపాయాలను దేవస్థాన కార్యనిర్వహణాధికారి విశ్వనాథరాజు, దేవస్థాన ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పి. భాస్కర సత్యనారాయణ పర్యవేక్షించినట్లు తెలిపారు.

## కల్వర్టులో పూడ్చండి ప్రమాదకరంగా మారిన కల్వర్టు





**సామర్లకోట. పెన్ పవర్.. ఆగష్టు. 30:**సామర్లకోట పిఠాపురం వెళ్ళే ప్రధాన రహదారికి సంబంధించి పెద్ద బజార్ సెంటర్ వద్ద కల్వర్టు ప్రమాదకరం ఉండడంతో పలు ప్రమాదాలు సంభవించడం జరుగుతుందని పలువురు వాపోతున్నారు. ఇటీవల కల్వర్టు వద్ద మున్సిపల్ పైప్ లైన్ పనులు చేపట్టడం కోసం ఇరువైపుల గోతులు తీసి పనులు నిర్వహించిన సమయంలో కల్వర్టు పై ఉన్న రోడ్డు కుంగిపోయిందని,ఆ సమయంలోనే పలు బారీ వాహనాలు ప్రయాణించడంతో మరింత ప్రమాదకరంగా మారిందని,రాత్రి వేళల్లో పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవ్వడం జరుగుతుందని స్థానికులు పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

## అంతర్వేది కరలో విద్యుత్ సబ్‌స్టేషన్‌కు స్థల పరిశీలన

**లోవోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం.. గ్రామస్తులు సహకరించాలి: ఎమ్మెల్యే దేవ వరప్రసాద్**



**పెన్ పవర్ ప్రతినిధి (అంతర్వేది కర) ఆగస్టు 30:**
డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది కర గ్రామపంచాయతీ పరిధిలో 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి సంబంధించి ఆదివారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ విద్యుత్ శాఖ అధికారులతో కలిసి స్థల పరిశీలన చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ మాట్లాడుతూ.. సబ్‌స్టేషన్ నిర్మాణానికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. సబ్‌స్టేషన్ అందుబాటులోకి వస్తే పరిసర ప్రాంతాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందడంతో పాటు ప్రస్తుతం ఉన్న లోవోల్టేజ్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. రానున్న 25 నుంచి 30 సంవత్సరాల వరకు విద్యుత్ సరఫరాకు సంబంధించి ఇబ్బందులు తలెత్తకుండా ఈ సబ్‌స్టేషన్ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.
సబ్‌స్టేషన్ నిర్మాణానికి అవసరమైన రహదారిని కూడా తగిన విధంగా వెడల్పు చేయాల్సిన అవసరం ఉందన్నారు. సబ్‌స్టేషన్ ఏర్పాటుతో స్థానికంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగే అవకాశం ఉందని తెలిపారు. సాంకేతికంగా సబ్‌స్టేషన్ నిర్మాణానికి అంతర్వేది కర ప్రాంతం అనుకూలంగా ఉందని విద్యుత్ శాఖ అధికారులు వెల్లడించినట్లు ఎమ్మెల్యే వివరించారు.
అంతర్వేది కర గ్రామంలో ప్రధాన సమస్యలుగా ఉన్న ముంపు, మంచినీరు, రహదారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని దశలవారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధికి చేపట్టే పనులకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.


## నిత్యావసర ధరలకు కళ్లెం వేయాలి

**ధరల పెరుగుదలతో సామాన్యులపై భారం.. ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలి: దేవాదుల సూర్యనారాయణమూర్తి**



**పెన్ పవర్ ప్రతినిధి ,(అమలాపురం) ఆగస్టు 30:**రాష్ట్రంలో పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలను ప్రభుత్వం తక్షణమే నియంత్రించాలని రాష్ట్ర వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. ఆదివారం అమలాపురంలో ఆయన మాట్లాడుతూ.. బియ్యం, పంచదార, పప్పు దినుసులు, వంట నూనె, ఉల్లిపాయలు తదితర నిత్యావసర వస్తువుల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.
ప్రత్యేక కారణాలు లేకపోయినా ప్రకృతి పరిస్థితులను సాకుగా చూపుతూ నిత్యావసర సరుకుల ధరలను పెంచుతున్నారని ఆయన ఆరోపించారు. ధరల పెరుగుదలతో సామాన్య ప్రజల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే రానున్న రోజుల్లో కుటుంబాలను పోషించుకోవడం కూడా కష్టతరమయ్యే పరిస్థితులు ఏర్పడతాయని అన్నారు.
కూటమి ప్రభుత్వం సామాన్యుల ఆదాయాన్ని పెంచడంలో విఫలమైందని, మరోవైపు అధిక ధరల కారణంగా బ్లాక్ మార్కెట్‌కు అవకాశం ఏర్పడుతోందని ఆరోపించారు. నిత్యావసర సరుకుల ధరల నియంత్రణకు ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, మార్కెట్‌పై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని డిమాండ్ చేశారు.
రానున్న పండుగ సీజన్‌లో నిత్యావసర వస్తువుల ధరలు మరింత పెరగకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు. ధరల పెరుగుదల భారాన్ని పూర్తిగా సామాన్య ప్రజలపై పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిత్యావసర సరుకుల ధరలపై ప్రత్యేక దృష్టి సారించి, ధరల నియంత్రణకు తక్షణ చర్యలు చేపట్టాలని దేవాదుల సూర్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు.

## ప్రయాణికురాలి బంగారు ఆభరణాల బ్యాగ్ అప్పగింత



**నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్**

**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 30:** ప్రయాణికురాలు బస్సులో మర్చిపోయిన బంగారు ఆభరణాలున్న బ్యాగ్‌ను ఆర్టీసీ డ్రైవర్ భద్రంగా తిరిగి అప్పగించి నిజాయితీ చాటుకున్నారు. విజయవాడ--కాకినాడ ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన ఓ మహిళా ప్రయాణికురాలు కాకినాడ వైఎస్సార్ సర్కిల్ వద్ద దిగిన అనంతరం తన బ్యాగ్ బస్సులోనే మర్చిపోయిన విషయాన్ని గుర్తించారు. దీంతో వెంటనే కాకినాడ ఆర్టీసీ డిపోకు చేరుకుని సిబ్బందికి సమాచారం అందించారు. డిపో సిబ్బంది సంబంధిత బస్సును తనిఖీ చేయగా బ్యాగ్ లభించింది. అందులో సుమారు రెండు తులాల బంగారు ఆభరణాలు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం బస్సు డ్రైవర్ బీఎస్ఎస్ వాసు,భద్రతా సిబ్బంది,విధుల్లో ఉన్న నియంత్రణాధికారి సమక్షంలో బ్యాగ్‌ను సంబంధిత మహిళా ప్రయాణికురాలికి భద్రంగా అప్పగించారు. విలువైన వస్తువులను జాగ్రత్తగా కాపాడి, ఎలాంటి స్వార్థం లేకుండా యజమానికి తిరిగి అప్పగించిన డ్రైవర్ బీఎస్ఎస్ వాసు నిజాయితీ, నిబద్ధతను డిపో మేనేజర్, సహాయ మేనేజర్ అభినందించారు. ప్రయాణికుల వస్తువుల భద్రత విషయంలో ఆర్టీసీ సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరిస్తున్న తీరుకు ఈ ఘటన నిదర్శనమని వారు పేర్కొన్నారు.

## 36 నెలలుగా గౌరవ వేతనాలు లేవు

**నల్లబ్యాడ్జీలతో ఎంపీటీసీల నిరసన.. బకాయిలు విడుదల చేయాలని డిమాండ్**



**పెన్ పవర్, ప్రతినిధి (ఐ.పోలవరం) ఆగస్టు 30:**
డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నియోజకవర్గం ఐ.పోలవరం మండలంలో ఎంపీటీసీ సభ్యుల సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. తమకు 36 నెలలుగా గౌరవ వేతనాలు అందడం లేదని నిరసన వ్యక్తం చేస్తూ ప్రజాప్రతినిధులు నల్లబ్యాడ్జీలు ధరించి సమావేశానికి హాజరయ్యారు.
ఈ సందర్భంగా ఎంపీపీ మోర్త మిరియాంజ్యోతి మాట్లాడుతూ.. 2021లో ఎంపీటీసీ సభ్యులుగా ఎన్నికై, సభ్యుల ఏకగ్రీవ నిర్ణయంతో ఎంపీపీగా ఎన్నికైనట్లు తెలిపారు. 2023 సెప్టెంబర్ వరకు గౌరవ వేతనాలు అందాయని, అనంతరం ఎన్నికల కోడ్ తదితర కారణాలతో వేతనాలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు సుమారు 36 నెలలుగా గౌరవ వేతనాలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు.
ఎంపీటీసీ సభ్యులను కూడా ప్రజాప్రతినిధులుగానే గుర్తించి, ఇతర ప్రజాప్రతినిధులతో సమానంగా గౌరవించాలని ఆమె కోరారు. తమకు రావాల్సిన బకాయి గౌరవ వేతనాలను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్కు విజ్ఞప్తి చేశారు.
స్థానిక సంస్థల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్న ఎంపీటీసీ సభ్యుల సమస్యను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలని సమావేశంలో పాల్గొన్న సభ్యులు కోరారు. బకాయి గౌరవ వేతనాలను వీలైనంత త్వరగా చెల్లించి, స్థానిక ప్రజాప్రతినిధులుగా తమను గౌరవించాలని వారు డిమాండ్ చేశారు.

## టీడీపీ కార్యకర్త సాయి గురుదత్త కుటుంబానికి రూ. 5 లక్షల ప్రమాద భీమా



**అంబాజీపేట , పెన్ పవర్, ఆగష్టు 30:** మాచవరం మెట్లకాలనీకి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త అడబాల సాయి గురుదత్త ఇటీవల ప్రమాదంలో మృతిచెందాడు. మృతుని కుటుంబానికి ఐదు లక్షల రూపాయలు టిడిపి పార్టీ ప్రమాద భీమా పరిహారం మంజూరైంది.
ఈ భీమా క్లెయిమ్ మొత్తాన్ని నామిని అయిన అడబాల బాల ఖాతాలో జమ చేసినట్లు సంబంధిత పత్రాలను టీడీపీ కో-కన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ, శెట్టి బజ్జి కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు , గణపతి రాఘవులు, సీనియర్ నాయకులు నాగాబత్తుల వెంకట సుబ్బారావు, రాష్ట్ర నీటిపారుదల శాఖ డైరెక్టర్ నాయకులు శిరిగినీడి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షులు గుడాల పణి, కార్యదర్శి రవణం రాము, జనసేన పార్టీ అధ్యక్షుడు దొమ్మేటి సాయి కృష్ణ,
మైపాల్ తాతాజీ, కొర్లపాటి వెంకటేశ్వరరావు ,(ఢిల్లీ) గ్రామ కమిటీ అధ్యక్షులు దొమ్మేటి శ్యామ్, తెలుగు యువత అధ్యక్షులు జోగి కృష్ణ చైతన్య, బూత్ కన్వీనర్ పులిదిండి శేఖర్, అడబాల సుబ్బరాజు, కొప్పునేటి ఈశ్వరరావు, యలమంచిలి బుచ్చిబాబు, యాగన రాము, దొమ్మేటి బాబూ ప్రసాదు ,ఎమ్ వి రమణ ,మానుపాటి గోవిశీదు ,కొప్పినీడి సాయి సూర్య, యర్రంశెట్టి నాగేంద్ర తదితరుల బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. పార్టీకి, ప్రజలకు నిరంతరం సేవలు అందించిన సాయి గురుదత్త అకాల మరణం టీడీపీ కుటుంబానికి తీరని లోటని, కష్టకాలంలో బాధిత కుటుంబానికి తెలుగుదేశం పార్టీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఉన్నారు.

## ప్లాస్టిక్ వ్యర్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలి




**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 30:** జాతీయ సముద్రతీర దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ వాకలపూడి బీచ్‌లో ఆదివారం బీచ్ క్లీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆల్ ఈజ్ వెల్ సభ్యుల ఆధ్వర్యంలో చేపట్టిన ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు, ఉషోదయ పాఠశాల విద్యార్థులు, జెన్ గ్రీన్ విద్యార్థులు పాల్గొని బీచ్ పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆల్ ఈజ్ వెల్ వ్యవస్థాపకుడు కిషోర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగస్టు 30న జాతీయ సముద్రతీర దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సముద్ర తీరాల అందాలను ఆస్వాదించడంతో పాటు వాటిని పరిశుభ్రంగా ఉంచడం, సముద్ర జీవుల సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. తీర ప్రాంతాల్లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలను వేయకుండా ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. ఆల్ ఈజ్ వెల్ సభ్యులు,దంత వైద్య నిపుణులు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ మాట్లాడుతూ ప్లాస్టిక్ వ్యర్థాల కారణంగా సముద్ర జీవుల మనుగడకు తీవ్ర ముప్పు ఏర్పడుతోందన్నారు. తీరాలను పరిశుభ్రంగా ఉంచడం ద్వారా సముద్ర జీవులను రక్షించవచ్చని పేర్కొన్నారు. బీచ్‌కు వెళ్లే సమయంలో వెంట తీసుకెళ్లిన బాటిళ్లు,కవర్లు తదితరాలను తిరిగి తీసుకువచ్చి డస్ట్‌బిన్‌లో వేయాలని సూచించారు. ఒకసారి వినియోగించే ప్లాస్టిక్ వాడకాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని, బీచ్ క్లీనింగ్ కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సముద్రతీర ప్రాంతాల్లో ఆహ్లాదకరమైన,పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పేందుకు ప్రజలు తమ వంతు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆల్ ఈజ్ వెల్ ఉపాధ్యక్షులు డాక్టర్ రాజకుమార్, కార్యదర్శి టి.వి.వి.ఎస్.ఎన్.రెడ్డి,డాక్టర్ రవివర్మ, విక్రమ్,రాజేంద్ర,శ్రీనివాసు, వెంకటనారాయణ,సీనియర్ సిటిజన్లు కరి నాగభూషణం,కృష్ణారావు, స్వామి తదితరులు పాల్గొన్నారు. అలాగే సుమారు 30 మంది జెన్ గ్రీన్ విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని బీచ్ శుభ్రతకు తమ సేవలను అందించారు.

# ఎన్టీఆర్ బీచ్‌లో డ్రోన్ కెమెరాలతో పోలీసుల ప్రత్యేక నిఘా






**కాకినాడ, పెన్ పవర్ ఆగస్టు 30:** ఆదివారం సెలవు కావడంతో కాకినాడ ఎన్టీఆర్ బీచ్‌కు భారీగా ప్రజలు తరలిరావడంతో పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్,ఆదేశాల మేరకు తిమ్మాపురం, మెరైన్ పోలీసులు బీచ్ పరిసరాల్లో నిరంతరం పర్యవేక్షణ చేపట్టారు.ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని డ్రోన్ కెమెరాలతో బీచ్ పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. జనసమ్మర్దం, అనుమానాస్పద కదలికలను డ్రోన్ల ద్వారా పర్యవేక్షిస్తూ, అవసరమైన ప్రాంతాల్లో పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట చర్యలు చేపట్టారు.ప్రజలు పోలీసులకు సహకరిస్తూ భద్రతా సూచనలు పాటించాలని ఎస్పీ జి.బిందు మాధవ్ సూచించారు.




## వాడపల్లి వెంకన్న.. దేశవ్యాప్తంగా హిందువుల ఇష్టదైవం

**కలియుగ దైవంగా భక్తుల ఆరాధన.. అన్నదాన భవనం ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ**





**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 30:**వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి కేవలం పాలసీమకు, పశ్చిమగోదావరి జిల్లాకు మాత్రమే పరిమితమైన దైవం కాదని, దేశవ్యాప్తంగా హిందువులందరూ ఇష్టపడే కలియుగ దైవమని కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాస్ వర్మ అన్నారు. ఆత్రేయపురం మండలం వాడపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో వకుళ మాత అన్నదాన భవనం ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ ముఖ్య అతిథిగా హాజరై అన్నదాన భవనాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాడపల్లి వెంకటేశ్వర స్వామిపై భక్తులకు ఉన్న విశ్వాసం ఎంతో గొప్పదని అన్నారు. తరతరాలుగా భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటున్నారని, వాడపల్లి క్షేత్రానికి ప్రత్యేకమైన ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. స్వామివారి దర్శనం కోసం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తుండటం వాడపల్లి క్షేత్రానికి ఉన్న విశిష్టతకు నిదర్శనమన్నారు.

వాడపల్లి వెంకన్నను ఒక ప్రాంతానికి చెందిన దేవుడిగా చూడకూడదని, దేశవ్యాప్తంగా హిందువుల ఆరాధ్య దైవంగా భక్తుల మనసుల్లో కొలువై ఉన్నారని శ్రీనివాస్ వర్మ పేర్కొన్నారు. కలియుగంలో భక్తులకు కొంగుబంగారంగా నిలిచే శ్రీ వెంకటేశ్వర స్వామి సన్నిధిలో సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో పుణ్యకార్యమని అన్నారు.

అన్నదానం మహోన్నత సేవ

భక్తులకు సౌకర్యాలు కల్పించడంతో పాటు అన్నదానం చేయడం గొప్ప సేవా కార్యక్రమమని కేంద్రమంత్రి అన్నారు. ఒకలమాత అన్నదాన భవనం నిర్మాణంతో స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు మరింత సౌకర్యం కలుగుతుందని చెప్పారు. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం కన్నా గొప్ప సేవ మరొకటి లేదని, భక్తి భావంతో చేపట్టే ఇటువంటి కార్యక్రమాలు సమాజానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి, భక్తుల సౌకర్యాల మెరుగుదలకు చేపట్టే కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు అవసరమైన మౌలిక వసతులు మరింత మెరుగుపడాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, ఎమ్మెల్యేలు ఆరేపల్లి రాధాకృష్ణ, ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు , ఆలయ ఉపక్రమిస్తారు నల్ల సూర్య చక్రధర్ రావు, ప్రజాప్రతినిధులు, భక్తులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు. స్వామివారి సన్నిధిలో అన్నదాన భవనం ప్రారంభం కావడంతో భక్తులు హర్షం వ్యక్తం చేశారు.

## పెద్దాపురంలో కార్డన్ సెర్చ్.. 7 వాహనాలు సీజ్



**పెద్దాపురం, పెన్ పవర్,ఆగస్టు 30:** మాదకద్రవ్యాల నియంత్రణ, నేరాల కట్టడి, అసాంఘిక కార్యకలాపాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ లక్ష్యంగా పెద్దాపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కొండయ్యపేట, జగన్నన్న కాలనీల్లో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్,ఆదేశాల మేరకు ఆదివారం ఉదయం 5.30 నుంచి 8.30 గంటల వరకు ఆపరేషన్ వజ్ర ప్రహార్‌లో భాగంగా ఈ తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా 25 ఇళ్లను తనిఖీ చేసి, 100 మంది ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. సరైన పత్రాలు లేని ఏడు వాహనాలను గుర్తించి తదుపరి చర్యల నిమిత్తం సీజ్ చేశారు. కాలనీ ప్రజలకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించి, మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల సమాచారాన్ని 1972 నంబర్‌కు తెలియజేయాలని సూచించారు.ఈ ఆపరేషన్‌లో పెద్దాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, సీసీఎస్ సీఐ అంకబాబు, పోలీసు సిబ్బంది, ఈగల్ టీమ్ సభ్యులు కలిపి 30 మంది పాల్గొన్నారు. నేర నియంత్రణ, మాదకద్రవ్యాల నిర్మూలన, ప్రజల భద్రత కోసం ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

## కాకినాడ జిల్లాలో నీట్ పీజీ పరీక్షలకు పటిష్ట బందోబస్తు




**కాకినాడ, పెన్ పవర్ ఆగస్టు 30:** జిల్లాలో నీట్ పీజీ పరీక్షలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా నిర్వహించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసింది. జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఆదేశాల మేరకు జిల్లాలోని ఐదు పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.భద్రతా ఏర్పాట్లను జిల్లా అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) డా. మహంతి కిషోర్ కుమార్ ప్రత్యక్షంగా పరిశీలించారు. పరీక్షా కేంద్రాలను సందర్శించి బందోబస్తును తనిఖీ చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా నిబంధనలు, పరీక్షార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై పోలీసు అధికారులకు, సిబ్బందికి సూచనలు చేశారు.పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని, పరీక్షా నిర్వాహకులతో సమన్వయంతో పనిచేయాలని అడిషనల్ ఎస్పీ ఆదేశించారు.

## పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి




**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 30:** పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి, పరిశుభ్రత కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములు కావాలని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి.ఈ.వి.ఎల్. నాయుడు పిలుపునిచ్చారు. లక్ష్మీ నారాయణ నగర్‌లోని ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛత, పచ్చదనం కార్యక్రమాన్ని నిర్వహించారు.ప్రతి ఆదివారం నిర్వహించే సేవా కార్యక్రమాల్లో భాగంగా కళాశాల సమీపంలోని రేచర్లపేట పబ్లిక్ పార్కులో 50 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు బృందాలుగా ఏర్పడి ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి పార్కును శుభ్రం చేశారు. అనంతరం మొక్కల చుట్టూ గుంతలు తవ్వి, వాటి సంరక్షణకు చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా డాక్టర్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొనడం అభినందనీయమన్నారు. ఆదివారం వంటి సెలవు రోజుల్లో కూడా కొంత సమయాన్ని సామాజిక సేవకు కేటాయించడం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని వీలైనంత వరకు తగ్గించాలని, స్వచ్ఛభారత్ నిర్మాణాన్ని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ బృందాన్ని ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డిగ్రీ కళాశాలల సెక్రటరీ డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ,ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు టి.తేజేశ్వరరావు,డి. అశ్విని,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఆస్తిపన్ను పెరిగినా.. పౌర సౌకర్యాలు కరువు



**కాకినాడ, పెన్ పవర్ ఆగస్టు 30:** నగరంలో ఆస్తిపన్ను ఆదాయం భారీగా పెరిగినా పౌర సౌకర్యాల కల్పనలో మాత్రం పురోగతి కనిపించడం లేదని పౌర సంక్షేమ సంఘం కన్వీనర్, సామాజికవేత్త దూసర్లపూడి రమణరాజు విమర్శించారు. కొత్తపేట మార్కెట్ బ్రిడ్జి దిగువ మార్గంలో పదేళ్లుగా మురుగు ముంపు సమస్య కొనసాగుతోందని, వర్షం వస్తే ఆ ప్రాంతం మురుగు జలాల చెరువుగా మారుతోందని తెలిపారు. పదేళ్లలో ఎనిమిది మంది కమిషనర్లు మారినా సమస్య పరిష్కారం కాలేదన్నారు.


బ్రిడ్జి దిగువన లోతుగా, తగిన వెడల్పుతో సెంటర్ డ్రైనేజీ నిర్మించి రేచర్లపేట రైల్వే గేటు వద్ద ఉన్న మేజర్ డ్రైనేజీకి అనుసంధానం చేయాలని డిమాండ్ చేశారు. 2022-23లో రూ.41.98 కోట్లుగా ఉన్న కార్పొరేషన్ ఆస్తిపన్ను ఆదాయం 2026-27లో రూ.76.30 కోట్లకు పెరిగినా పౌర సౌకర్యాలు మాత్రం మెరుగు పడలేదన్నారు. ఆస్తిపన్ను ఏటా 15 శాతం పెరగడం, భూమి విలువను రెండుసార్లు పెంచడంతో పన్నుల భారం సుమారు 135 శాతం పెరిగిందని పేర్కొన్నారు.నగరంలో సుమారు 40 శాతం వీధి కల్వర్టులు దిగబడి పోయాయని,వాటిని పునర్నిర్మించడంతో పాటు ప్రధాన డ్రైనేజీల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని రమణరాజు కోరారు. ప్రజాప్రతినిధులు కొత్తపేట మార్కెట్ బ్రిడ్జి దిగువన సమావేశం నిర్వహిస్తే అక్కడి దుర్గంధం, మురుగు ముంపు దుస్థితి ప్రత్యక్షంగా తెలుస్తుందని అన్నారు.

# ఘనంగా డీపీఆర్వో పెద్దింటి రవి పదవీ విరమణ వీడ్కోలు సభ




**కాకినాడ, పెన్ పవర్,ఆగస్టు 30:** తూర్పుగోదావరి జిల్లా పౌర సంబంధాల అధికారి (డీపీఆర్వో)గా సేవలందించి ఆగస్టు 31న పదవీ విరమణ చేయనున్న పెద్దింటి రవికి ఆదివారం కాకినాడలోని హోటల్ బ్లూమ్‌లో ఆత్మీయ వీడ్కోలు సభ ఘనంగా నిర్వహించారు.సమాచార పౌర సంబంధాల శాఖ జోన్-2 జాయింట్ డైరెక్టర్ టి.తిమ్మప్ప,కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల డీఐపీఆర్వోలు బి.పద్మజ,లక్ష్మీనారాయణ,సీనియర్ పాత్రికేయులు టి.మధుసూదనరావు, విశ్రాంత డీడీ డి.నాగార్జున తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పాత్రికేయులు,సమాచార శాఖ అధికారులు,సిబ్బంది,విశ్రాంత ఉద్యోగులు,బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు పెద్దింటి రవి దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ తిమ్మప్ప మాట్లాడుతూ సమాచార పౌర సంబంధాల శాఖలో 39 సంవత్సరాల 6 నెలల పాటు వివిధ హోదాల్లో బాధ్యతాయుతంగా పనిచేసిన రవి సేవలను కొనియాడారు.ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో, మీడియా సమన్వయంలో ఆయన చేసిన కృషి అభినందనీయమన్నారు. అనంతరం అతిథులు రవి దంపతులను శాలువా,పూలబొకేతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.తన ఉద్యోగ ప్రస్థానంలో సహకరించిన ఉన్నతాధికారులు,సహోద్యోగులు, మీడియా మిత్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులకు పెద్దింటి రవి కృతజ్ఞతలు తెలిపారు. అందరితో ఏర్పడిన మధురానుబంధం చిరకాలం కొనసాగాలని ఆకాంక్షించారు.

## దళితపేటలో దోమలు బెడద



**పెద్దాపురం మండల .. ఆర్ బి పట్నం.పెన్ పవర్. ఆగస్టు. 30.** రాయభూపాలపట్నం దళిత పేటలో డ్రైనేజీలు వల్ల దోమలు బెడదతో తీవ్ర ఇబ్బంది పడుతున్న దళిత పేట కాలనీ వాసులు డ్రైనేజీలో చెత్త చెదారం ఎక్కువ అవ్వడం తో దోమల వల్ల ప్రజలే తీవ్ర ఇబ్బంది పడుతున్నారు డ్రైనేజీలు వల్ల చెత్తాచెదారం పేరుకుపోవడంతో దోమలు బెడద ఎక్కువ అవుతుందని కాలనీ వాసులు అంటున్నారు డ్రైనేజీ కాలములకు ఎప్పటికప్పుడు దోమల మందు కొట్టాలని బ్లీచింగ చల్లాలని ప్రజలు ఆవేదన చెందుతున్నారు

# అమ్మవారి ఆలయ ని ప్రారంభించిన ఎమ్మెల్యే సత్య ప్రభ రాజా....





**శంఖవరం పెన్ పవర్ ఆగస్టు 30:**-కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం శంఖవరం గ్రామంలో శ్రీశ్రీశ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి నూతన ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు వరుపుల సత్యప్రభ రాజా ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారిని దర్శించు కున్నారు.

అనంతరం ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా కనకదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రత్తిపాడు నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, సుభిక్షంగా జీవించాలని అమ్మవారిని ప్రార్థించారు. ప్రజలపై అమ్మవారి కరుణాకటాక్షాలు ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

నూతన ఆలయ ప్రారంభోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. అమ్మవారి దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. వేదమంత్రోచ్చారణలు, పూజా కార్యక్రమాలతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా తో పాటు నియోజకవర్గ కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అన్నవరం దేవస్థానం పాలక మండలి సభ్యులు పర్వత సురేష్, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కమిటీ సభ్యులు వెన్న ఈశ్వరుడు (శివ), సత్తిపాడు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మేడిశెట్టి సూర్యకిరణ్ (బాబి), ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి నరసింహమూర్తి (బుజ్జి), రౌతులపూడి ఎంపీపీ గంటిమల్ల రాజ్యలక్ష్మి, జనసేన పార్టీ శంఖవరం మండల ఉపాధ్యక్షుడు తలపంటి బుజ్జి,టీడీపీ సీనియర్ నాయకులు బద్ది రామారావు, బొమ్మిడి సత్య నారాయణ, రాజాల చిట్టిబాబు,ఉమ్మి వనలక్ష్మి, పొలం చిన్న, పలివెల సతీష్,కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వద్దిపర్రులో "పల్లె నిద్ర".. ప్రజల సమస్యలు తెలుసుకున్న పోలీసులు

పల్కు నిద్ర చేసిన ఆత్రిపురం ఎస్సై ఎస్ రాము




**ఆత్రేయపురం పెన్ పవర్ ఆగస్టు 30:**డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా, ఐ.పి.ఎస్. ఆదేశాల మేరకు, కొత్తపేట డీఎస్పీ ఎస్. మురళీమోహన్, రావులపాలెం రూరల్ సీఐ శ్రీ విద్యాసాగర్ ఉత్తర్వుల ప్రకారం ఆత్రేయపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని వద్దిపర్రు గ్రామంలో "పల్లె నిద్ర" కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో ఆత్రేయపురం సబ్-ఇన్స్పెక్టర్ ఎస్. రాము పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని ప్రస్తుత పరిస్థితులు, శాంతిభద్రతల పరిస్థితి, అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని స్థానిక ప్రజలను అడిగి తెలుసుకున్నారు.అలాగే నూతన చట్టాలు, సైబర్ నేరాలు, రోడ్డు భద్రతా నియమాలు, పోక్సో చట్టం, సోషల్ మీడియా వినియోగం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న వివిధ రకాల నేరాల తీరుతెన్నులు, వాటి బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన విధానంపై వివరించారు.

గ్రామ పరిధిలో ఎలాంటి శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా పోలీస్ శాఖ నిరంతరం చర్యలు తీసుకుంటుందని అధికారులు తెలిపారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే పోలీస్ అధికారుల దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి వేగవంతమైన చర్యలు చేపడతామని ప్రజలకు హామీ ఇచ్చారు.అదేవిధంగా గ్రామంలో అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం, చెడు నడత కలిగిన వ్యక్తుల కదలికలు, అనుమానాస్పదంగా సంచరించే కొత్త వ్యక్తుల వివరాలను పోలీస్ శాఖకు తెలియజేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వద్దిపర్రు గ్రామ పెద్దలు, యువకులు, స్థానిక ప్రజలు పాల్గొని గ్రామంలోని వివిధ సమస్యలను పోలీస్ అధికారుల దృష్టికి తీసుకువచ్చి చర్చించారు.

# కట్టుదిట్టమైన భద్రత మధ్య ప్రశాంతంగా ముగిసిన నీట్ పీజీ పరీక్ష





**కాకినాడ, పెన్ పవర్ ఆగస్టు 30:** కాకినాడ జిల్లాలో నీట్ పీజీ పరీక్ష అత్యంత కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ తెలిపారు. ఆదివారం జిల్లాలోని నీట్ పీజీ పరీక్షా కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్ష నిర్వహణ, విద్యార్థుల హాజరు, వసతులు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.కాకినాడలోని సాఫ్ట్ టెక్నాలజీ, ఐఆన్ డిజిటల్ జోన్ పరీక్షా కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రశాంత వాతావరణంలో ముగిసిందన్నారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.జిల్లాలోని ఐదు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 1,159 మంది విద్యార్థులకు గాను 1,147 మంది పరీక్షకు హాజరయ్యారని, 98.95 శాతం హాజరు నమోదైనట్లు కలెక్టర్ వెల్లడించారు.

# లాస్య సత్య జ్యోతికి తుమ్మలపల్లి రమేష్ ఆశీర్వాదం



**గండేపల్లి,పెన్ పవర్, ఆగస్టు 30:** ఫంక్షన్ హాల్లో గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు మేడిబోయిన శ్రీను తమ్ముడు శివరామకృష్ణ కుమార్తె లాస్య సత్య జ్యోతి ఓణీల ఫంక్షన్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జగ్గంపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరై లాస్య సత్య జ్యోతిని ఆశీర్వదించారు.

ఈ సందర్భంగా ఆమె భవిష్యత్తు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, విజయవంతంగా సాగాలని తుమ్మలపల్లి రమేష్ ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులు, బంధువులు, జనసేన నాయకులు, కార్యకర్తలు కార్యక్రమంలో పాల్గొని లాస్య సత్య జ్యోతికి శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమంలో మేడిబోయిన శ్రీను, మేడిబోయిన గంగ, అంకం ఓం, దాడి చిన్నబుజ్జి, మాదారపు వీరబాబు, కాయల మణికంఠ, దూది శ్రీను, అయ్యప్ప గుంటముక్కల చిన్న, కొలమూరు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు విగ్రహాలావిష్కరణ





**కొవ్వూరు, పెన్ పవర్, ఆగస్ట్ 30:** తూర్పుగోదావరి జిల్లాలోని కొవ్వూరు నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, దివంగత పెండ్యాల వెంకట కృష్ణారావు(కృష్ణబాబు) విగ్రహాలావిష్కరణ మహోత్సవం దొమ్మేరు బస్టాండ్ సెంటర్లో, కొవ్వూరు గామన్ బ్రిడ్జిల అత్యంత వైభవంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యనపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు, రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ హాజరై పెండ్యాల కృష్ణబాబు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు, కైకలూరు శాసనసభ్యులు డాక్టర్ కామినేని శ్రీనివాస్, రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ, కాపు కార్పొరేషన్ ఛైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, సీనియర్ రాజకీయ నాయకులు కేవీపీ రామచంద్రరావు, మహమ్మద్ అహ్మద్ షరీఫ్, ఆంధ్రా షుగర్స్ జేఎండీ పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) తదితరులు పాల్గొన్నారు. విగ్రహ ఆవిష్కరణ అనంతరం ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో నాయకులందరూ కృష్ణబాబు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... నిస్వార్థ రాజకీయ నాయకునిగా సుదీర్ఘకాలం ప్రజలకు సేవలందించిన పెండ్యాల కృష్ణబాబు కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం శ్రమించారని, ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సభలో పాల్గొన్న ఇతర ప్రముఖులు సైతం ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ నివాళులు అర్పించారు.

# వర్గపోరుకు ఆజ్యం పోయొద్దు.. రామాలయ నిర్మాణం నిలిపివేయాలి.

-పారుపాక పరిస్థితిపై ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ వెంటనే స్పందించాలి.

-తెలుగు మహిళా జాగృతి అధ్యక్షురాలు దేవర అనూష యాదవ్





**కిర్లంపూడి/ప్రత్తిపాడు, పెన్ పవర్, ఆగస్టు 30:**కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం,రౌతులపూడి మండలం పారుపాక గ్రామంలో చేపడుతున్న రామాలయ నిర్మాణంపై వివాదం నెలకొంది. ఈ విషయంపై పలువురు గ్రామ ప్రజలు, తెలుగు మహిళా జాగృతి అధ్యక్షురాలు దేవర అనూష యాదవ్‌ను ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెంలో కలిసి,గ్రామ సచివాలయం ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలంలో రామాలయ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ సమస్యను వివరించారు. ఈ సందర్భంగా దేవర అనూష యాదవ్ పెద్దిపాలెం గ్రామంలో విలేకరులతో మాట్లాడుతూ చిన్న గ్రామంలో ఇప్పటికే ఒక రామాలయం ఉండగా రెండో రామాలయం నిర్మించాల్సిన అవసరం ఏమిటని అధికారులను ప్రశ్నించారు.ఎలాంటి ముందస్తు నిర్ణయం,గ్రామ ప్రజల సమ్మతి లేకుండా రాత్రికి రాత్రే విగ్రహాలను ఏర్పాటు చేయాలని ప్రయత్నించడంలో ఆంతర్యమేంటని నిలదీశారు.రామాలయ నిర్మాణం విషయంలో గ్రామంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయని,ఇటువంటి పరిస్థితుల్లో నిర్మాణాన్ని కొనసాగించడం వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు.ఒకవేళ గ్రామంలో శాంతిభద్రతల సమస్య తలెత్తితే అందుకు బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు.ఆలయ నిర్మాణానికి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి ఎందుకు వచ్చిందో అధికారులు,ప్రజాప్రతినిధులు ఆలోచించాలని కోరారు.

గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పడాల తిరుమల వెంకన్న దొర కారణంగా వర్గపోరు ఏర్పడే పరిస్థితులు ఉన్నాయని అనూష యాదవ్ ఆరోపించారు.గ్రామంలో ఇప్పటికే ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా చూడాలని కోరారు.ఇదిలా ఉండగా సచివాలయం,రైతు సేవా కేంద్రం పక్కన పశువులకు వైద్యం అందించేందుకు బోను నిర్మించుకోవాలని గ్రామ ప్రజలు నిర్ణయించుకున్నట్లు గ్రామానికి చెందిన గుంటబోయిన చిట్టిబాబు,వియ్యపు నూకరాజు తెలిపారు.ఇప్పటికే ఈ స్థలంలో ఏర్పాటు చేసేందుకు బోనును జిల్లా కలెక్టర్ అందించారని పేర్కొన్నారు.ఈ స్థలానికి సంబంధించిన అంశంపై హైకోర్టును ఆశ్రయించినట్లు వారు తెలిపారు.విషయం న్యాయస్థానం పరిధిలో ఉండగానే అక్కడ నిర్మాణం చేపట్టడం ఏంటని ప్రశ్నించారు.కోర్టు పరిధిలో ఉన్న అంశంపై నిర్మాణం కొనసాగించడం సరైనది కాదని,దీనివల్ల గ్రామంలో మరింత ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని అనూష యాదవ్ పేర్కొన్నారు.ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ వెంటనే స్పందించి పరిస్థితిని పరిశీలించాలని కోరారు.రామాలయ నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని,గ్రామంలో శాంతిభద్రతలను కాపాడేలా చర్యలు తీసుకోవాలని మీడియా ముఖంగా విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో నక్కా అబ్బులు,గుంటబోయిన నాగేశ్వరరావు,ఉల్లంకుల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# కడప వైసీపీ మేయర్... కృష్ణా జిల్లా అల్లుడికి జగన్ గ్రీన్‌సిగ్నల్... ?



**హైదరాబాద్ పెన్ పవర్:** కడప కార్పొరేషన్‌లో ఎలాగైనా విజయం సాధించి, తమ కంచుకోటను కాపాడుకోవాలని వైఎస్సార్‌సీపీ గట్టి పట్టుదలతో ఉంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో కడప మేయర్ పదవిపై వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఒకవేళ కడప మేయర్ స్థానం ఓసీ జనరల్‌కు కేటాయిస్తే, వైఎస్సార్‌సీపీ తరపున పోటీ చేసేందుకు పలువురు ఆశావాహులు ఆసక్తి చూపుతున్నారు. వీరిలో వైఎస్సార్‌సీపీ డాక్టర్ల విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన డాక్టర్ గోసుల శివభారత్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది.

కడప నివాసి అయిన డాక్టర్ శివభారత్‌రెడ్డికి వైఎస్సార్ కుటుంబంతో దశాబ్దాల కాలంగా మంచి స్నేహ సంబంధాలు ఉన్నాయి. ఆయన సతీమణి సీతారామలక్ష్మి కృష్ణా జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దుట్టా రామచంద్రరావు కుమార్తె. వైఎస్ రాజశేఖరరెడ్డితో దుట్టా కుటుంబానికి సుదీర్ఘ అనుబంధం ఉంది. వైఎస్సార్, దుట్టా ఇద్దరు కలిసి చదువుకున్నారు. ఈ క్రమంలోనే దుట్టాకు జగన్ 2014లో గన్నవరం అసెంబ్లీ టిక్కెట్ కూడా ఇచ్చారు. ఇక దుట్టా అల్లుడు శివభారత్‌రెడ్డి భార్య కాపు (బలిజ) సామాజిక వర్గానికి చెందినవారు. దీంతో కడప నగరంలో గణనీయంగా ఉన్న బలిజ సామాజిక వర్గ ఓటర్ల మద్దతు కూడా ఆయనకు లభించే అవకాశాలున్నాయని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. శివభరత్ రెడ్డి భార్య ప్రస్తుతం కృష్ణా జిల్లా ఉంగుటూరు వైసీపీ జడ్పీటీసీగా ఉన్నారు.ఇక శివభరత్ రెడ్డికి వైఎస్ జగన్‌తో మంచి స్నేహం ఉండటం, వివాద రహితుడు, విద్యావంతుడు కావడం, స్థానికంగా ఆర్థికంగా స్థితిమంతుడు కావడం డాక్టర్ శివభారత్‌రెడ్డికి రాజకీయంగా పెద్ద కలిసివచ్చే అంశాలు ప్రస్తుతం ఆయన స్థానికంగా మద్దతు కూడగట్టే పనిలో ఉన్నారని సమాచారం. కడప నగరంలో వైఎస్సార్‌సీపీ ప్రభావం గట్టిగా ఉన్నందున, సరైన అభ్యర్థిని రంగంలోకి దించితే గెలుపు సులువవుతుందని పార్టీ భావిస్తోంది.

రిజర్వేషన్ అనుకూలించడం, జగన్ ఆశీస్సులు ఎలాగూ ఉంటాయన్న ధీమాతో శివభారత్‌రెడ్డి పోటీ చేయడం ఖాయంగా కనిపిస్తోంది. కడప నగరంలోని డివిజన్ల విభజనపై ప్రస్తుతం కోర్టులో కేసు నడుస్తోంది. ఈ న్యాయపరమైన అంశాలు కొలిక్కి వచ్చిన తర్వాతే ఎన్నికల హడావిడి మొదలవుతుంది.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పో. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# ఆ ఉత్తరాంధ్ర నేత ఎవరు? - వైసీపీలో విజయసాయిరెడ్డి సస్పెన్స్!

**హైదరాబాద్ పెన్ పవర్:** విపక్షం వైసీపీలో మాజీ ఎంపీ వి.విజయసాయిరెడ్డి రాసిన లేఖ కలకలం సృష్టిస్తోంది. తన లేఖలో వైసీపీ నుంచి బయటకు రావడానికి దారితీసిన కారణాలను స్పష్టం చేయడమే కాకుండా, పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిపై విమర్శలు గుప్పించారు విజయసాయిరెడ్డి. ఇదే సమయంలో ఉత్తరాంధ్ర ఇంచార్జిగా తనను తప్పించడానికి సజ్జలతోపాటు ఉత్తరాంధ్ర నేత ఒకరు కుట్ర చేశారని ఆరోపించారు. అంతటితో ఆగకుండా ఆ ఉత్తరాంధ్ర నేత ప్రస్తుతం పార్టీ మారడానికి సిద్ధంగా ఉన్నారంటూ లీకులిచ్చారు. విజయసాయిరెడ్డి లేఖలో ఆ ఉత్తరాంధ్ర నేత పేరు రాయకపోవడంతో పార్టీ మారడానికి ప్రయత్నిస్తున్న ఆ నాయకుడు ఎవరంటూ అంతర్గతంగా విస్తృత చర్చ జరుగుతోంది.ఉత్తరాంధ్రకు చెందిన నాయకుడు ఒకరు పార్టీ మారడానికి సిద్దంగా ఉన్నారంటూ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి ఇచ్చిన లీకు వైసీపీలో హాట్ టాపిక్ అవుతోంది. స్థానిక ఎన్నికల వేళ ఆ ఉత్తరాంధ్ర నాయకుడు ఎవరు అంటూ సాధారణ కార్యకర్తల నుంచి పార్టీ అధిష్టానం పెద్దలు వరకు ఆరా తీస్తున్నారు. పార్టీ అధిష్టానానికి బాగా దగ్గరగా ఉన్న నేత అంటూ విజయసాయిరెడ్డి చెప్పడంతో ఆ నేత మాజీ మంత్రి అయ్యే అవకాశం ఉందని అనుమానిస్తున్నారు. దీంతో ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన పలువురు మాజీ మంత్రులు, వారి ప్రస్తుత తీరుతెన్నులను చర్చిస్తూ పార్టీ మారేందుకు ఉన్న అవకాశాలపై ఊహాగానాలు వ్యక్తం చేస్తున్నారు.

**ఆ నేత బొత్స అవ్వొచ్చా?**

పార్టీ మారడానికి సిద్ధంగా ఉన్న ఉత్తరాంధ్ర నేత అంటూ పేరు చెప్పకుండా మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి సస్పెన్స్ క్రియేట్ చేయడంతో ఆ నేత బొత్స కావచ్చునేమో అంటూ పలువురు పరిశీలకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఇటీవల వైసీపీ నుంచి జనసేనలో చేరనున్నారంటూ బొత్సపై పలు ఉహాగానాలు వ్యాపించాయి. సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారానికి ఎటువంటి ప్రాతిపదిక లేకపోయినా వదంతులు మాత్రం వేగంగా విస్తరించాయి. అయితే ఈ ఊహాగానాలపై బొత్స, ఆయన అనుచరులు స్పందించలేదు. ఊరు, పేరు లేని ప్రచారాన్ని ఖండించాల్సిన అవసరం లేకపోయినా, రాజకీయంగా ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల వల్ల క్లారిటీ ఇస్తే బాగుంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇక మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కూడా ఈ ప్రచారాన్ని నమ్మి బొత్స పేరు ప్రస్తావించకుండా ఆరోపణలు చేశారా? లేక ఇంకెవరైనా నిర్దిష్టమైన నేత పార్టీ మార్పుపై ఆయనకు సమాచారం ఉందా? అన్న విషయంపై క్లారిటీ రావాల్సివుందని అంటున్నారు.

**ఇంకెవరు అవ్వొచ్చు!**

వైసీపీలో విజయసాయిరెడ్డి పనిచేసిన సమయంలో ఆయనే బలవంతుడు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి అత్యంత సన్నిహితుడు. అలాంటి నేతపై చాడీలు చెప్పి, పదవి నుంచి తొలగించేలా చేయగలిగే నాయకుడు ఉత్తరాంధ్రలో ఎవరై ఉంటారనేది విస్తృత చర్చగా ఉంది. ఉత్తరాంధ్రలో వైసీపీ హయాంలో చాలా మంది మంత్రులుగా పనిచేశారు. అందరిలో సీనియర్ నేతలు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, గుడివాడ అమరనాథ్ మాత్రమే నేరుగా అధిష్టానంతో సంప్రదింపులు జరిపే సత్తా ఉన్నా నేతలుగా చెబుతున్నారు. వీరిలో విజయసాయిరెడ్డికి పొగ పెట్టినంత దమ్ము ఎవరికి ఉంది? అన్నదే పార్టీలో చర్చనీయాంశంగా మారిందని అంటున్నారు. పార్టీని గందరగోళంలోని నెట్టేందుకు విజయసాయిరెడ్డి మైండ్ గేమ్ అడుతున్నారా? లేక నిజంగానే తనను టార్గెట్ చేసిన ఉత్తరాంధ్ర నేతపై అపనమ్మకం కలిగించే వ్యూహంతో లేఖరాశారా అన్నదే తేలాల్సివుందని అంటున్నారు

# మేయర్ సీటుపై కమ్మ నేతల కన్ను ?

**హైదరాబాద్ పెన్ పవర్:** విశాఖ మేయర్ అంటే ఎంతో ప్రతిష్టాత్మకమైనది అన్నది తెలిసిందే. ఏడాదికి అయిదు వేల కోట్ల బడ్జెట్ తో కార్పోరేషన్ నిర్వహణ సాగుతోంది. రానున్న అయిదేళ్లలో ఇది కాస్తా పది వేల కోట్లకు చేరుకుంటుంది అన్నది కూడా ఉంది. అలాగే శివారు ప్రాంతాలలోని గ్రామ పంచాయతీలు మండలాలను విలీనం చేసుకోవడం ద్వారా బృహత్ విశాఖ కార్పోరేషన్ గా అవతరించనుంది. ఇక జీవీఎంసీ పరిధిలోనే దేశంలో అతి పెద్ద గూగుల్ డేటా సెంటర్ నిర్మాణం అవుతోంది. ఐటీ కంపెనీలు వస్తున్నాయి. అలాగే మిట్టల్ స్టీల్ ప్లాంట్ తో పాటు అనేక పరిశ్రమలు ఏర్పాటు అవుతున్నాయి. దాంతో జీవీఎంసీ ఆర్థికంగా అన్ని విధాలుగా ముందుకు దూసుకుని పోయే అవకాశాలు ఉన్నాయి అని అంటున్నారు. కూటమి ప్రభుత్వానికి విశాఖ మీద ఫోకస్ ఉంది. ప్రత్యేకించి టీడీపీ విశాఖను ఆర్థిక పారిశ్రామిక రాజ్ధానిగా భావిస్తోంది. ఆ విధంగానే అభివృద్ధి చేస్తోంది.

**టీడీపీ టార్గెట్ :**

విశాఖ మేయర్ సీటుని 1987లో టీడీపీ దక్కించుకుంది. ఆనాడు డీవీ సుబ్బారావు ఎన్నిక అయ్యారు. అది ప్రత్యక్ష ఎన్నికలలోనే జరిగింది. అయిదేళ్ల పాటు ఆనాటి పాలనలో చేసిన అభివృద్ధి కార్యక్రమాలను ఈ రోజుకీ చెప్పుకుంటారు. ఇక ఆనాటి నుంచి మళ్ళీ మేయర్ సీటు టీడీపీకి దక్కలేదు. 2025 లో వైసీపీ మేయర్ మీద అవిశ్వాసం ప్రవేశపెట్టి ఒక ఏడాది మాత్రం టీడీపీ పాలన చేసింది. ఈసారి అలా కాదు పూర్తి కాలం తాము అధికారంలో ఉంటే విశాఖకు ఒక రూపు షేపూ తీసుకుని రావచ్చు అని పసుపు పార్టీ ఆలోచిస్తోంది. దాంతో విశాఖ మేయర్ సీటు టీడీపీకే దక్కుతుందన్నది అందరికీ తెలిసిపోయింది. దాంతో టీడీపీలోనే పెద్ద ఎత్తున పోటీ ఏర్పడుతోంది.

**కమ్మ నేతల చూపు :**

విశాఖ మేయర్ గా ఇప్పటిదాకా చూస్తే రెడ్డి, బ్రాహ్మణ, వెలమ, యాదవ, మత్స్యకార,, గవర సామాజిక వర్గాలకు చెందిన వారు పనిచేశారు. ఈసారి ఇతర సామాజిక వర్గాలకు కూడా అవకాశం ఇవ్వాలని డిమాండ్ పెరుగుతోంది. మేయర్ గా కాపులకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. ఎందుకంటే ఎక్కువ జనాభాగా వారు ఉన్నారని గుర్తు చేస్తున్నారు. అదే సమయంలో కమ్మ సామాజిక వర్గం నేతల నుంచి ఈసారి అనూహ్యంగా రేసులో చాలా పేర్లు వినిపిస్తున్నాయి. దాంతో విశాఖ మేయర్ సీటు ఎవరికి దక్కుతుందన్నది టీడీపీలో తీవ్ర స్థాయిలో చర్చ సాగుతోంది.

**వీరంతా పోటీకి :**

కమ్మ సామాజిక వర్గం నుంచి విశాఖ జిల్లా టీడీపీ ప్రెసిడెంట్ గా ఉన్న చోడె వెంకట పట్టాభిరాం పోటీలో ఉంటారని ప్రచారం ఊపందుకుంది. ఆయన కొద్ది నెలల క్రితం కీలకమైన పార్టీ పదవిని అందుకున్నారు. దాంతో పాటు రుషికొండ వెంకటేశ్వర స్వామి ఆలయ పాలక మండలి చైర్మన్ గా నామినేటెడ్ పదవిని అందుకున్నారు. ఆయన గతంలో జీవీఎంసీలో కార్పోరేటర్ గా పనిచేయడమే కాదు టీడీపీ తరపున ఫ్లోర్ లీడర్ గా పనిచేశారు. దాంతో ఆయనకు జీవీఎంసీ పాలనా వ్యవహారాల మీద పూర్తి అవగాహన ఉందని అంటున్నారు. దాంతో ఆయన పేరుని రేసులో ముందుకు తెస్తున్నారు. ఆయన కూడా సుముఖంగా ఉన్నారని అంటున్నారు. ఆయన అభ్యర్ధిత్వం పట్ల టీడీపీ పెద్దలు సానుకూలంగా ఉంటారని కూడా మాట వినిపిస్తోంది.

**ఆయన చూపు మేయర్ సీటు మీద :**

అలాగే విశాఖ తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు కూడా తన కుమారుడుని మేయర్ సీటు కోసం ముందు వరసలోకి తెస్తున్నారు అని అంటున్నారు. ఇప్పటికే యువ నేతగా ఉన్న ఆయన విశాఖ తూర్పు నుంచి ఎమ్మెల్యేగా పోటీకి దిగుతారు అని ప్రచారం ఉంది. కానీ ఇపుడు ఆయన చూపు మేయర్ సీటు మీద పడింది అని అంటున్నారు. సీనియర్ నేతగా ఉన్న వెలగపూడికి మంత్రి పదవి అయితే దక్కాల్సి ఉంది. కానీ సామాజిక సమీకరణలో ఇవ్వలేకపోయారు. దాంతో ఆయన కుమారుడికి మేయర్ సీటు ఇస్తారా అన్న చర్చ అయితే సాగుతోంది. వీరిద్దరితో పాటు మరికొందరు కమ్మ నేతల చూపు కూడా విశాఖ మేయర్ సీటు మీద ఉంది. అయితే విజయవాడ మేయర్ సీటును బట్టి ఇక్కడ అభ్యర్ధి నిర్ణయం టీడీపీ చేస్తుంది అని అంటున్నారు. విజయవాడ మేయర్ సీటు కాపులకు ఇస్తే విశాఖ కమ్మలకు ఇస్తారని కూడా అంటున్నారు. చూడాలి మరి ఈ ప్రచారం ఏ మేరకు నిజం అవుతుంది అన్నది.

# అటు కూటమి బలం.. ఇటు జగన్ వార్నింగ్... వాళ్లకు టెన్షన్...?



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులలో తీవ్ర ఆందోళనను నింపుతున్నాయి. ముఖ్యంగా రాష్ట్రంలోని 16 కార్పొరేషన్ల మేయర్ పదవులతో పాటు, మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థుల ఎంపిక వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జులకు పెద్ద తలనొప్పిగా మారింది. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వాన్ని స్థానిక ఎన్నికల్లో ఢీకొట్టడం అంత తేలికైన విషయం కాదు. అధికార పక్షానికి ఉండే ఆర్థిక బలం, అధికారుల సహకారం, మరియు స్థానిక అభివృద్ధి కోసం అధికార పార్టీకే ఓటేయాలన్న ఆలోచన ఉంటే ప్రజల మనస్సులను డైవర్ట్ చేయడం ఇవన్నీ ఇప్పుడు వైసీపీ నాయకులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.

ఇక ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండున్నరేళ్లు అవుతోంది. కూటమి ప్రభుత్వంపై అసంతృప్తి ఉన్నా స్థానిక ఎన్నికల్లో ప్రత్యర్థిని గెలిపిస్తే తమ పట్టణాలు అభివృద్ధికి దూరమవుతాయని ఓటర్లలో సందేహం ఉంటుంది. అందుకే స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో విజయం అధికార పార్టీలకే ఉంటుంది. అసలు చాలా చోట్ల ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు పోటీ చేసేందుకే ముందుకు రారు. ఇప్పుడు ఏపీలో కూటమి అంటూ మూడు బలమైన పార్టీలు కలిసి ఉన్నాయి. ఈ కూటమి నేతల సామ, దాన, భేద, దండోపాయాలను తట్టుకుని నిలబడగలిగే బలమైన నేతలు వైసీపీకి దొరకడం కష్టంగా మారింది.

**డైరెక్ట్ ఎలక్షన్ టెన్షన్ :**

ఈసారి మేయర్, మున్సిపల్ ఛైర్మన్ల ఎంపిక ప్రత్యక్ష పద్ధతిలో (డైరెక్ట్ ఎలక్షన్) జరగనుండటంతో చివరి నిమిషం వరకు అధికార పార్టీ నుంచి ప్రలోభాలు, ఒత్తిళ్లు ఉండే అవకాశం ఉంది. వీలైనన్ని స్థానాలను ఏకగ్రీవం చేసుకోవాలని కూటమి ప్రభుత్వం భావిస్తుండగా, పోటీ లేకుండా ఏకగ్రీవమైతే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సీటు ఇచ్చేది లేదని అధినేత జగన్ చేసిన హెచ్చరికలు ఇన్చార్జులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. జగన్ ఏకగ్రీవం అయిన నియోజకవర్గాల్లో వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వను అంటూ ఖరాఖండీగా చెప్పడంతో వైసీపీ ఇన్చార్జ్‌లు పోటీ పెట్టేందుకు అభ్యర్థులను వెతుక్కోవడం, వారికి ఆర్థిక వనరులను సమకూర్చుకోవడం, గెలిపించుకోవడం లాంటి విషయాల్లో సతమతం కానున్నారు.

కొన్ని చోట్ల అభ్యర్థులు ముందుకు వచ్చే పరిస్థితి లేదు. జగన్ ఏకగ్రీవాల విషయంలో వార్నింగ్‌లు ఇవ్వడంతో కూటమి చాలా ప్రెస్టేజ్‌గా తీసుకుని పులివెందుల లాంటి చోట్లే ఏకగ్రీవాలు చేయాలని పట్టుదలతో ఉంది. ఇక మిగిలిన నియోజకవర్గాల్లో పరిస్థితి ఎలా ఉంటుందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇక పార్టీ కేడర్ అయితే ప్రతిపక్షంలో ఉంటూ సొంత డబ్బులు ఖర్చు పెట్టేందుకు నేతలు వెనుకాడుతున్నారు. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే అభ్యర్థుల ఎంపిక పూర్తయి, ఎన్నికలు ముగిసే వరకు వైసీపీ నియోజకవర్గ ఇన్చార్జులకు టెన్షన్ తప్పేలా లేదు.

# బొప్పరాజుపై తిరుగుబాటు..!?
# కాకపుట్టిస్తున్న ఉద్యోగ సంఘాల రాజకీయం



**హైదరాబాద్ పెన్ పవర్:** ఏపీలో ఉద్యోగ సంఘాల మధ్య విభేదాలు ముసురుకుంటున్నాయా? అన్న చర్చ జరుగుతోంది. ఉద్యోగుల డిమాండ్ల సాధనకంటూ ఏపీ జేఏసీ (అమరావతి) చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మూడు దశల ఉద్యమ కార్యాచరణ ప్రకటించగా, ఆయన తీరును నిరసిస్తూ రెవెన్యూ ఎంప్లాయిస్ యూనియన్, ఏపీ జేఏసీ నేతలు వేర్వేరుగా మీడియాకు ఎక్కడం చర్చనీయాంశం అవుతోంది. ప్రధానంగా ఏపీ జేఏసీ (అమరావతి) చైర్మన్ బొప్పరాజు రహస్య రాజకీయ అజెండా అమలు చేస్తున్నారని మిగిలిన ఉద్యోగ సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వంతో సానుకూల సహకారాన్ని కోరుకుంటూనే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ను కించపరిచేలా బొప్పరాజు వ్యాఖ్యలు ఉన్నాయని తప్పుపడుతున్నారు. దీంతో ఉద్యోగ సంఘాల నేతలపై ఉద్యోగుల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై చాలా ఆశలు పెట్టుకున్నట్లు చెబుతున్నారు. ప్రధానంగా ఉద్యోగుల పీఆర్సీ, డీఏ బకాయిల చెల్లింపు వంటి ఆర్థికాంశాలుపై ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. గత రెండేళ్లలో రూ.22 వేల కోట్ల బకాయిల చెల్లింపు, ఒకటో తేదీన జీతాలు, 10 వేల మంది ఉద్యోగులకు ఓపీఎస్, 8 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులరైజేషన్, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచడం వంటి డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చినా ఆర్థిక ప్రయోజనాలు అందజేయడంలో ఇంకా నిర్లక్ష్యం వహిస్తోందని ఉద్యోగ సంఘాలు అభిప్రాయపడుతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు అంటూ ఉద్యోగ సంఘాల జేఏసీలు ప్లాన్ చేస్తున్నాయి. ఇందులో భాగంగా అమరావతి జేఏసీ నేత బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గత శుక్రవారం విజయవాడలో సమావేశం నిర్వహించారు. అయితే ఆ సమావేశానికి హాజరైన వివిధ సంఘాల నేతలు, కొందరు కమ్యూనిస్టు పార్టీల నేతలు ఉద్యోగుల సమస్యలపై కాకుండా, రాజకీయ లక్ష్యాలతో మాట్లాడినట్లు కనిపిస్తోందని రెవెన్యూ ఎంప్లాయీస్ జేఏసీ చైర్మన్ భూపతిరాజు రవీంద్రరాజు అనుమానం వ్యక్తం చేస్తూ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేయడం సంచలనం రేపుతోంది. ప్రధానంగా అమరావతి జేఏసీ చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు లక్ష్యంగా భూపతిరాజు రవీంద్రరాజు చేసిన వ్యాఖ్యలు హీట్ పుట్టిస్తున్నాయి.

బొప్పరాజు ఆధ్వర్యంలోని జరిగిన సదస్సులో కొందరు నాయకులతో బయట నుంచి వచ్చిన స్క్రిప్టు ప్రకారం మాట్లాడించేందుకు ప్రయత్నించారని చేసిన ఆరోపణలు సంచలనం సృష్టిస్తున్నాయి. సీఎం చంద్రబాబును విమర్శించడం, ఆయనపై వ్యంగ్య చిత్రాలు ప్రదర్శించడమే కాకుండా, సీఎం సతీమణి వ్యాఖ్యలను కూడా వ్యంగ్యంగా స్క్రీన్ పై ప్రదర్శించారని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అనారోగ్యంతో బాధపడుతుంటే ఆయనపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని భూపతిరాజు రవీంద్రరాజు మండిపడుతున్నారు. ఇక బొప్పరాజు నిర్వహించిన సదస్సుకు సంబంధం లేకుండా ఉద్యోగుల ? సమస్యలపై తాము సొంతంగా నిర్ణయం తీసుకుంటామని ఏపీ జేఏసీ చైర్మన్ విద్యాసాగర్ ప్రకటించారు.

సమస్యల పరిష్కారానికి ముందుగా మంత్రులతో చర్చిస్తామని, అనంతరం ముఖ్యమంత్రితో భేటీ అవుతామని విద్యాసాగర్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. దీంతో అమరావతి జేఏసీతో సంబంధం లేకుండా తాము పనిచేస్తామని ఏపీ జేఏసీ తేల్చిచెప్పినట్లైంది. మరోవైపు బొప్పరాజు ప్రకటించి ఉద్యమ కార్యాచరణతోపాటు ముఖ్యమంత్రిపై విమర్శలను తీవ్రంగా పరిగణిస్తున్నట్లు రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ప్రకటించారు. ఉద్యోగులు-ప్రభుత్వం మధ్య సఖ్యతను చెడగొట్టేలా బొప్పరాజు వెంకటేశ్వర్లు వ్యవహరిస్తున్నారని రెవెన్యూ మంత్రి ఆరోపించారు. తాము ఉద్యోగ సంఘాల డిమాండ్లపై చిత్తశుద్ధితో పనిచేస్తున్నప్పటికీ, గత ప్రభుత్వ బకాయిలను తమకు అంటగడుతూ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మొత్తానికి ఈ పరిణామాలతో అమరావతి జేఏసీ ప్రకటించిన మూడు దశల ఉద్యమ కార్యాచరణపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వానికి తాము వ్యతిరేకం కాదని ఆ సమావేశంలో బొప్పరాజు ప్రకటించినప్పటికీ, ఆయన సమక్షంలో కొందరు నేతలు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రితోపాటు ప్రభుత్వంతో సంబంధం లేని ముఖ్యమంత్రి సతీమణి భువనేశ్వరిపై వ్యంగ్య చిత్రాలు ప్రదర్శించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో బొప్పరాజు ప్రకటించిన ఉద్యమంతో తమకు సంబంధం లేదని మిగతా సంఘాల నేతలు చెప్పుకునే ప్రయత్నం చేస్తున్నారని అంటున్నారు. ఏపీ జేఏసీ కూడా సొంతంగా పనిచేయాలని నిర్ణయించడంతో ఉద్యోగ సంఘాల్లో భిన్నాభిప్రాయాలు స్పష్టమవుతున్నాయని అంటున్నారు.

### ఆ కోచ్ లు విషపూరితం.. బాబర్ వైఫల్యాలకు వారే కారణం:

## పాక్ మాజీ క్రికెటర్ యూసుఫ్ మండిపాటు



- బాబర్ అజామ్ ఫామ్ కోల్పోవడానికి కోచ్‌లే కారణమన్న మహ్మద్ యూసుఫ్
- జట్టులోని కొందరు కోచ్‌లు ఆటకు విషం లాంటివారని తీవ్ర విమర్శలు
- 2022 డిసెంబర్ నుంచి టెస్టుల్లో సెంచరీ చేయలేకపోయిన బాబర్
- ఆటగాళ్ల టెక్నిక్‌లోని లోపాలను సరిదిద్దడంలో కోచ్‌లు విఫలమయ్యారని ఆరోపణ
- ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లోనూ పాకిస్థాన్ పేలవ ప్రదర్శన

**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ టెస్ట్ కెప్టెన్ బాబర్ అజామ్ సుదీర్ఘకాలంగా పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతుండటంపై ఆ దేశ మాజీ క్రికెటర్ మహ్మద్ యూసుఫ్ సంచలన వ్యాఖ్యలు చేశాడు. బాబర్ ఫామ్ కోల్పోవడానికి, అతని టెక్నిక్‌లోని లోపాలను సరిదిద్దుకోలేకపోవ డానికి జట్టులోని 'కొందరు కోచ్‌లే' కారణమంటూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డాడు. వారిని "ఆటకు విషం లాంటి వారు" అని అభివర్ణిస్తూ సోషల్ మీడియాలో ఆగ్రహం వ్యక్తం చేశాడు.

ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో బాబర్ అజామ్ ఔటైన తీరును కామెంటేటర్ నాసిర్ హుస్సేన్ విశ్లేషించిన వీడియోను షేర్ చేస్తూ మహ్మద్ యూసుఫ్ ఈ వ్యాఖ్యలు చేశాడు. "కొన్నేళ్ల క్రితమే నేను ఈ విషయంపై హెచ్చరించాను. కానీ, బాబర్ చుట్టూ ఉన్న కొందరు నాసిరకం కోచ్‌లు అతనిలోని లోపాలను సరిదిద్దుకోవడానికి అనుమతించలేదు. సులభంగా పరిష్కరించగల సమస్యను కూడా వారు పట్టించుకోలేదు. ఆ వైఫల్యమే ఇప్పుడు పాకిస్థాన్ క్రికెట్‌ను ఈ పతనానికి లాగింది" అని యూసుఫ్ ఎక్స్‌లో పేర్కొన్నాడు. "ఈ కోచ్‌లు ఆట పట్ల విషపూరితమైన వారు. వారికి విజన్ లేదు, పురోగతిని అడ్డుకుంటారు, ప్రతిభావంతులైన ఆటగాళ్లను తప్పుదోవ పట్టిస్తారు. మన క్రికెటర్లు ఎవరి మాట వినాలో నేర్చుకోకపోతే వారి కెరీర్లు అనుకున్నదానికంటే ముందే ముగుస్తాయి. మన ఆటగాళ్ల బలహీనమైన టెక్నిక్ ఇప్పుడు బంగ్లాదేశ్ నుంచి ఇంగ్లండ్ వరకు బట్టబయలైంది" అని మండిపడ్డాడు. 2022 డిసెంబర్ తర్వాత బాబర్ అజామ్ ఇప్పటివరకు టెస్టుల్లో శతకం నమోదు చేయలేదు. అనేకసార్లు సెంచరీకి చేరువగా వచ్చినప్పటికీ విఫలమయ్యాడు. అతని ఫామ్‌తో పాటు పాకిస్థాన్ జట్టు ప్రదర్శన కూడా దారుణంగా ఉంది. విదేశాల్లో ఆడిన గత 10 మ్యాచ్‌ల్లో పాక్ 9 ఓడిపోయింది. ప్రస్తుతం ఇంగ్లండ్‌తో లార్డ్స్ వేదికగా జరుగుతున్న టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో పాక్ కేవలం 110 పరుగులకే కుప్పకూలింది. పేలవ ఫామ్ కారణంగా 2023 చివర్లో కెప్టెన్సీ కోల్పోయిన బాబర్‌ను, షాన్ మసూద్ సారథ్యంలోనూ జట్టు వైఫల్యాలు కొనసాగడంతో 2026 జులైలో తిరిగి కెప్టెన్‌గా నియమించిన సంగతి తెలిసిందే.

## దులీప్ ట్రోఫీలో చారిత్రక ఘట్టం.. 15 ఏళ్లకే కెప్టెన్‌గా వైభవ్ సూర్యవంశీ

- దులీప్ ట్రోఫీ సెమీస్‌లో ఈస్ట్ జోన్ కెప్టెన్‌గా 15 ఏళ్ల వైభవ్
- కెప్టెన్ ఇషాన్ కిషన్‌కు గాయం కావడంతో అనూహ్యంగా బాధ్యతలు
- సీనియర్ ఆటగాళ్లు షమీ, ముఖేష్ ఉన్న జట్టుకు సారథ్యం
- భవిష్యత్ నాయకుడిగా తీర్చిదిద్దేందుకే వైస్ కెప్టెన్సీ అన్న సెలక్టర్లు
- భారత ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అరుదైన ఘట్టంగా నమోదు



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత దేశవాళీ క్రికెట్‌లో ఒక చరిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. కేవలం 15 ఏళ్ల వయసున్న యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ, దులీప్ ట్రోఫీ వంటి ప్రతిష్ఠాత్మక టోర్నమెంట్‌లో ఈస్ట్ జోన్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. బెంగళూరు వేదికగా సెంట్రల్ జోన్‌తో జరుగుతున్న సెమీ ఫైనల్ మ్యాచ్‌లో రెగ్యులర్ కెప్టెన్ ఇషాన్ కిషన్ గాయపడటంతో, వైస్ కెప్టెన్‌గా ఉన్న వైభవ్ ఈ అనూహ్య బాధ్యతలను స్వీకరించాడు. మ్యాచ్‌లో సెంట్రల్ జోన్ ఇన్నింగ్స్ 19వ ఓవర్ సందర్భంగా ఈ సంఘటన చోటుచేసుకుంది. వికెట్ కీపింగ్ చేస్తున్న ఇషాన్ కిషన్ కుడి చేతి మణికట్టుకు బంతి బలంగా తాకింది. మైదానంలోనే ఫిజియోలు ప్రాథమిక చికిత్స అందించినప్పటికీ, నొప్పి తీవ్రంగా ఉండటంతో అతను మైదానాన్ని వీడాల్సి వచ్చింది. అనంతరం అతని చేతికి పెద్ద కట్టుతో డగౌట్‌లో కనిపించాడు. దీంతో ఇషాన్ స్థానంలో కుమార్ కుశాగ్ర వికెట్ కీపింగ్ బాధ్యతలు చేపట్టగా, కెప్టెన్సీ పగ్గాలు 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ చేతికి వచ్చాయి. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో ఇంత చిన్న వయసులో ఒక సీనియర్ జట్టుకు నాయకత్వం వహించడం ఒక అరుదైన రికార్డుగా నిలిచింది. వాస్తవానికి, ఈ టోర్నీకి ముందు వైభవ్ సూర్యవంశీని వైస్ కెప్టెన్‌గా నియమించడంపై దేశవాళీ క్రికెట్ వర్గాల్లో కొంత చర్చ జరిగింది. అయితే, ఈస్ట్ జోన్ సెలక్టర్లు తమ నిర్ణయాన్ని సమర్థించుకున్నారు. స్వల్పకాలిక అవసరాల కోసం కాకుండా భవిష్యత్ నాయకుడిగా తీర్చిదిద్దేందుకే ఈ కుర్రాడికి ఈ బాధ్యతలు అప్పగించామని స్పష్టం చేశారు. 2024 ఆరంభంలోనే ఫస్ట్ క్లాస్ అరంగేట్రం చేసిన వైభవ్‌కు ఇది కేవలం పదో ఫస్ట్ క్లాస్ మ్యాచ్, రెండో దులీప్ ట్రోఫీ మ్యాచ్ మాత్రమే. అనూహ్యంగా కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టినప్పటికీ, వైభవ్ ఏమాత్రం తడబడలేదు. మైదానంలో ఉన్న ఆటగాళ్లందరిలో తానే చిన్నవాడైనా, మహ్మద్ షమీ, ముఖేష్ కుమార్, అభిమన్యు ఈశ్వరన్ వంటి అంతర్జాతీయ, దేశవాళీ అనుభవజ్ఞులతో కూడిన జట్టును సమర్థంగా నడిపించాడు. లంచ్ విరామానికి సెంట్రల్ జోన్‌ను 81 పరుగులకే 3 వికెట్లు కోల్పోయేలా చేయడంలో తన వ్యూహాలను అమలు చేశాడు. అంతర్జాతీయ స్థాయిలో రాణించిన బౌలర్లకు ఫీల్డింగ్ సెట్ చేస్తూ, యువ కెప్టెన్ అందరి దృష్టిని ఆకర్షించాడు. ఇషాన్ కిషన్ గాయం నుంచి ఎంత త్వరగా కోలుకున్నా, ఈ మ్యాచ్ మాత్రం భారత క్రికెట్‌లో వేగంగా ఎదుగుతున్న వైభవ్ సూర్యవంశీ కెరీర్‌లో ఒక మైలురాయిగా నిలిచిపోతుంది అనడంలో సందేహం లేదు.

## శ్రీలంకకు భారీ షాక్.. 2027 ఉమెన్స్ ఛాంపియన్స్ ట్రోఫీ హోస్టింగ్ రైట్స్ రద్దు చేసిన ఐసీసీ!




**హైదరాబాద్ పెన్ పవర్:** శ్రీలంక క్రికెట్ బోర్డు కి అంతర్జాతీయ క్రికెట్ మండలి (×జజ) ఊహించని బిగ్ షాక్ ఇచ్చింది. 2027 ఫిబ్రవరి 14 నుంచి 28 వరకు జరగాల్సిన తొలి ఐసీసీ మహిళల ఛాంపియన్స్ ట్రోఫీ ఆతిథ్య హక్కులను శ్రీలంక నుంచి తరలించడానికి ఐసీసీ సంచలన నిర్ణయం తీసుకుంది. బోర్డు నిర్వహణలో పదే పదే లంక ప్రభుత్వం జోక్యం చేసుకోవడం, ఐసీసీ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడమే ఈ కఠిన నిర్ణయానికి ప్రధాన కారణం. దీంతో ఈ మెగా టోర్నమెంట్‌ను శ్రీలంక నుంచి మరో దేశానికి తరలించనున్నారు.

**ప్రభుత్వ జోక్యమే ముంచేసింది:**
శ్రీలంక క్రికెట్ బోర్డు పాలనా వ్యవహారాలను ప్రస్తుతం ప్రభుత్వం నియమించిన ట్రాన్స్‌ఫార్మేషన్ కమిటీ పర్యవేక్షిస్తోంది. క్రికెట్ బోర్డులు సర్కార్ నుంచి స్వతంత్రంగా, ప్రజాస్వామ్యబద్ధమైన ఎన్నికల ద్వారా మాత్రమే పనిచేయాలని ఐసీసీ స్పష్టమైన నియమం విధించినప్పటికీ లంక గవర్నమెంట్ మాత్రం దాన్ని పట్టించుకోలేదు. దాంతో ఆతిథ్య హక్కులు చేజారిన విషయాన్ని కమిటీ కార్యదర్శి ప్రకాష్ షాఫ్టర్ ధృవీకరించారు. ఈ టోర్నీని ఏ దేశంలో నిర్వహించాలనేది ఐసీసీ తదుపరి బోర్డు సమావేశంలో ఫిక్స్ చేయనుంది.

**గతంలోనూ ఇలాంటి ఘటన.. లంకకు భారీ ఆర్థిక నష్టం:**
ఐసీసీ నుంచి శ్రీలంకకు ఇలాంటి షాక్ తగలడం ఇదే తొలిసారి కాదు. 2023లోనూ ప్రభుత్వ జోక్యం కారణంగా శ్రీలంక క్రికెట్‌ను సస్పెండ్ చేసిన ఐసీసీ, 2024 పురుషుల అండర్-19 ప్రపంచకప్ ఆతిథ్య హక్కులను రద్దు చేసి దక్షిణాఫ్రికాకు బదిలీ చేసింది. ఇప్పుడు మరోసారి ప్రసిద్ధ టోర్నీని చేజార్చుకోవడంతో లంక క్రికెట్ బోర్డుకు కోట్ల రూపాయల ఆతిథ్య ఆదాయం కోల్పోవడంతో పాటు అక్కడి హోటళ్లు, పర్యాటక, వ్యాపార రంగాలు తీవ్రంగా నష్టపోనున్నాయి.

**టోర్నీలో లంక జట్టు అర్హతపై తీవ్ర అనిశ్చితి:**
ఆతిథ్య హక్కులు కోల్పోవడంతో పాటు ఈ ఛాంపియన్స్ ట్రోఫీలో శ్రీలంక మహిళల జట్టు అసలు ఆడుతుందా లేదా అనేదానిపై కూడా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తం 6 జట్లు పాల్గొనే ఈ టోర్నీలో ఆతిథ్య దేశ హోదాలో శ్రీలంకకు నేరుగా అర్హత దక్కాల్సి ఉంది. ప్రస్తుతం ఐసీసీ వన్డే/టీ20 ర్యాంకింగ్స్‌లో శ్రీలంక 6వ స్థానంలో ఉంది. ఇప్పుడు ఆతిథ్యం మరో దేశానికి మారితే, శ్రీలంకకు టోర్నీలో స్థానం దక్కుతుందో లేదో ఐసీసీ విడుదల చేసే కొత్త అర్హత నిబంధనలపై ఆధారపడి ఉంది.


# 2027 లో ముహూర్తం ఫిక్స్ చేసారా?



బాలీవుడ్ స్టార్ రణబీర్ కపూర్, అలియాభట్ జంటగా అయాన్ ముఖర్జీ తెరకెక్కించిన విజువల్ వండర్ -బ్రహ్మాస్త్ర: పార్ట్ వన్ - శివ- డివైడ్ టాక్ బయటపడిన సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్ట్ ప్రారంభంలోనే రెండు భాగాలుగా తెరకెక్కిస్తున్నామని ప్రకటించారు. అయితే మొదటి భాగం టాక్ తర్వాత రెండవ భాగం ఉండదని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. అయినా ఆ ప్రచారాన్ని యూనిట్ ఎప్పటికప్పుడు కొట్టి పారేసింది. అయినా పార్ట్ 2 తీసే ధైర్యం చేస్తారా? అన్న సందేహాలు మాత్రం ఆగలేదు. కాల క్రమంలో యూనిట్ ధీమా చూసి పార్ట్ 2 ఉంటుందని అంతా ఓ అంచనాకి వచ్చారు. తాజాగా ఈ ప్రాజెక్ట్ సెట్స్‌పైకి వెళ్లే సమయం గురించి ఓ క్రేజీ అప్‌డేట్ నెట్టింట వైరల్ అవుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం -బ్రహ్మాస్త్ర 2- చిత్రాన్ని 2027 ఏప్రిల్ నుంచి పట్టాలెక్కించడానికి మేకర్స్ ముహూర్తం ఫిక్స్ చేశారు. మొదటి భాగం ముగింపులోనే రెండవ భాగానికి సంబంధించిన దేవ్ పాత్రను పరిచయం చేస్తూ అయాన్ ముఖర్జీ క్యూరియాసిటీని పెంచారు. దాంతో ఈ సీక్వెల్‌ను అంతర్జాతీయ ప్రమాణాలకు ఏమాత్రం తగ్గకుండా గ్రాండ్‌గా తెరకెక్కించేందుకు చిత్ర యూనిట్ సుదీర్ఘ ప్రీ-ప్రొడక్షన్ పనులను ప్లాన్ చేసింది. ఆలస్యానికి ప్రధాన కారణం రణబీర్



కపూర్ మిగతా భారీ ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉండటమే. నితేష్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న -రామాయణ- షూటింగ్‌ను రణబీర్ త్వరలోనే పూర్తి చేయనున్నారు. సోర్సెస్ ద్వారా తెలిసిందేంటంటే? వచ్చే ఏడాది జనవరి నాటికి రణబీర్ రామాయణం నుంచి పూర్తి గా రిలీవ్ అవుతారని అంటున్నారు. అనంతరం రెండు..మూడు నెలల గ్యాప్ అనంతరం -బ్రహ్మాస్త్ర 2- లో రణబీర్ జాయిన్ అవుతారు. అయితే ఈ సీక్వెల్లో అనేక ఆసక్తికరమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మొదటి భాగంలో ఈషాగా మెప్పించిన అలియా భట్, రెండవ భాగంలో అతిథి పాత్ర కే పరిమితం కానుందని టాక్. రణ్బీర్ కపూర్ ఈ చిత్రంలో దేవ్ -శివగా ద్విపాత్రాభినయం చేయబోతున్నారని సమాచారం. పవర్‌ఫుల్ అమృత పాత్ర కోసం సౌత్ నుంచి ఒక టాప్ హీరోయిన్‌ను రంగంలోకి దించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయట. నిర్మాణ పరంగా కూడా మేకర్స్ భారీ ప్లాన్లే వేశారు. విజువల్ వండర్‌ను గ్లోబల్ రేంజ్‌లో నిలబెట్టేందుకు -రామాయణ- నిర్మాత ప్రైమ్ ఫోకస్ అధినేత నమిత్ మల్హోత్రను ప్రాజెక్ట్‌లో ప్రధాన భాగస్వామిగా తీసుకొచ్చారు. గ్రాఫిక్స్ .. విఎఫ్ ఎక్స్ ఆధారిత చిత్రాలకు నమిత్ మల్హోత్రా తోడవటం వల్ల సాంకేతిక ప్రమాణాలు నెక్స్ట్ లెవెల్‌లో ఉండబో తున్నాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.



Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com